## స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర సాధనలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై, స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమ నిర్వహణపై జిల్లా అధికారులు, తదితరులతో మంగళవారం కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో పాటు విభిన్న రంగాల్లో ప్రతిభ చూపే వ్యక్తులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు తమ అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వడం ద్వారా స్వర్ణాంధ్ర విజన్‌లో పాలుపంచుకోవాలని సూచించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోను ద్వారా స్కాన్ చేసి మీ పేరు, చరవాణి సంఖ్య, ఇ-మెయిల్ తదితర వివరాలను పొందుపరిచి అభిప్రాయాలను పంపుకోవాలన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేయాలని చెప్పారు.

## జిల్లాలో ఆరు చోట్ల ఆర్వోబీల నిర్మాణాలు!

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఆరు చోట్ల ఆర్వోబీల నిర్మాణాలు చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 64 ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. అందులో ఏలూరు జిల్లాకు సంబంధించిన ప్రాంతాలు ఆరు ఉన్నాయి. ఏలూరు పవరుపేట, భీమడోలు, దెందులూరు మండలం సీతంపేట, ఉంగుటూరు, పూళ్ల, కైకరంలో ఆర్వోబీల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ, రైల్వే, ఆర్ అండ్ బీ, విద్యుత్తు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల బృందం మంగళవారం ఉంగుటూరు, కైకరంలో రైల్వే గేట్ల వద్ద ఆర్వోబీల నిర్మాణ అనుకూల పరిస్థితులను పరిశీలించారు. త్వరలో మిగతా నాలుగు చోట్ల క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని ఏలూరు ఆర్డీవో ఖాజావలి తెలిపారు. మంగళవారం నాటి సర్వేలో రైల్వే అధికారులు శశికుమార్, శ్రీకాంత్, సాయికుమార్, తహసీల్దారు బి.దుర్గాప్రసాద్, ఆర్ అండ్ బీ ఏఈ ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


ఉంగుటూరు రైల్వే గేటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏలూరు ఆర్డీవో ఖాజావలి తదితర అధికారులు

ఈనాడు
ఏలూరు
బుధవారం సెప్టెంబరు 25, 2024


# విధేయతకు సముచిత స్థానం

### ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి కీలక పదవులు

ఈనాడు, ఏలూరు, కొయ్యలగూడెం గ్రామీణ, చింతలపూడి, న్యూస్‌టుడే: కూటమి సర్కారు విధేయతకు సముచిత స్థానం కల్పించింది. కష్టకాలంలో తమ సీట్లను సైతం త్యాగం చేసి పార్టీ విజయం కోసం పని చేసిన ఉమ్మడి పశ్చిమలోని ముగ్గురు తెదేపా నేతలకు కీలక పదవులు కట్టబెట్టింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) ఛైర్మన్‌గా తెదేపా పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, ఏపీ ట్రైకార్ ఛైర్మన్‌గా (ఏపీ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్) పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి ఛైర్‌పర్సన్‌గా మాజీ మంత్రి పీతల సుజాతను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.

త్యాగాలకు గుర్తింపు..

పదవులు దక్కిన ముగ్గురు నేతలు తొలి నుంచి పార్టీ నియమావళికి కట్టుబడి పని చేశారు. అధినేత ఆదేశాలకు అనుగుణంగా నడుచుకున్నారు. తీరా పొత్తుల్లో భాగంగా సీట్ల సర్దుబాటులో వీరు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అవకాశం కోల్పోయినా పార్టీకి విధేయంగా వ్యవహరించారు. కూటమి అభ్యర్థులు ఎవరైనా తామే పోటీలో ఉన్నట్లు భావించి పార్టీ విజయానికి కృషి చేశారు. ఇంత కష్టపడిన నేతలకు అధినేత సైతం సముచిత స్థానాలు కట్టబెట్టి గౌరవించారని పార్టీ శ్రేణుల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

అధినేత మాటే శాసనంగా..



2019లో వైకాపా హోరులో ఉమ్మడి పశ్చిమ నుంచి విజయం సాధించిన ఇద్దరిలో రామరాజు ఒకరు. తాజా ఎన్నికల్లో సైతం తొలి జాబితాలో ఆయనకు ఎమ్మెల్యే సీటు ఖరారైంది. అనూహ్య పరిణామాలతో ఉండి సీటును పార్టీ అధిష్ఠానం రఘురామకృష్ణరాజుకు కేటాయించి తెదేపా జిల్లా పగ్గాలను రామరాజుకు అప్పగించింది. అధినేత మాటే పరమావధిగా శక్తి వంచన లేకుండా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఆయన త్యాగానికి సరైన గుర్తింపు దక్కింది.

రాజకీయ నేపథ్యం

2009లో ప్రజారాజ్యం తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో తెదేపా టికెట్ కోసం యత్నించి విఫలమయ్యారు. పట్టు విడవకుండా 2019 ఎన్నికల్లో టికెట్ దక్కించుకుని పోటీ చేసినా విజయం వరించలేదు. అప్పటి నుంచి పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ విపక్ష పాత్రను సమర్థంగా పోషించారు. 2024లో మరోసారి అవకాశం చేజారింది. తాజాగా అధిష్ఠానం ఆశీస్సులతో ట్రైకార్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

2006లో కలవపూడి సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2007లో తెదేపాలో చేరిన ఆయన 2009, 2014 ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 2019 ఎన్నికల్లో వైకాపా హవాలోనూ ఉండి నుంచి తెదేపా అభ్యర్థిగా పోటీ చేసి 10,949 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. విపక్ష ఎమ్మెల్యేగా ప్రజా ఉద్యమాల్లో కీలకంగా పనిచేశారు.

పొత్తు ధర్మానికి కట్టుబడి



తెదేపా పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు నియోజకవర్గంపై మంచి పట్టుంది. ఇటీవల సార్వత్రిక ఎన్నికల పొత్తు ధర్మంలో భాగంగా పోలవరం సీటు జనసేనకు కేటాయించారు. కార్యకర్తలు ఆ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా ఆయన మాత్రం ఎక్కడా పార్టీ ఆదేశాలను అతిక్రమించలేదు. చెదిరిపోతున్న కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. రెండు పార్టీల మధ్య సమన్వయం సాధించి కూటమి అభ్యర్థి విజయం దిశగా వేరే కోణంలో కీలకంగా వ్యవహరించారు. ఆయన కృషికి సముచిత స్థానం దొరికింది.

పార్టీనే తల్లిగా భావించి..



పీతల సుజాత రెండు దశాబ్దాలుగా పార్టీని అంటిపెట్టుకుని వీర విధేయురాలిగా పేరు తెచ్చుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పటికీ 2019, 2024లో పోటీ చేసే అవకాశం దక్కకున్నా పార్టీనే తల్లిగా భావించి కొనసాగారు. పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని జిల్లాలో ముందుకు తీసుకెళ్లడంలో చాలా చురుగ్గా పని చేశారు. మహిళల సమస్యలపై పోరాటం చేశారు. దీంతో సీఎం చంద్రబాబు సైతం ఆమెకు మంచి పదవి ఇచ్చి గౌరవించారు.

2004 ఎన్నికల్లో తొలిసారి ఆచంట నుంచి తెదేపా అభ్యర్థిగా నిలిచి గెలుపొందారు. 2009లో టికెట్ దక్కకపోయినా పార్టీ కోసం పనిచేశారు. 2014లో చింతలపూడి నుంచి బరిలో నిలిచి 15 వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొంది మంత్రి పదవి దక్కించుకున్నారు. 2019, 2024 ఎన్నికల్లో సీటు దక్కకపోయినా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

## నిషేధం ఎత్తివేత ఎవరికోసం..!

జిల్లాలో 14,766 ఎకరాలు అసైన్‌మెంట్ జాబితా నుంచి తొలగింపు

వైకాపా హయాంలో తీసుకున్న నిర్ణయంపై పునఃపరిశీలన

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఒకటి రెండు కాదు ఏకంగా 14,766 ఎకరాల అసైన్‌మెంట్ భూములను వైకాపా ప్రభుత్వ హయాంలో నిషేధిత జాబితా (22 ఏ) నుంచి తొలగించారు. దీంతో ఆయా భూముల లబ్ధిదారులు క్రయవిక్రయాలు చేసుకునేందుకు వీలుకలిగింది. వీరంతా 2003కు ముందు ప్రభుత్వం నుంచి పట్టాలు పొందిన పేదలు. వాస్తవానికి ఈ భూములను పట్టాలు పొందిన వ్యక్తులు, వారి వారసులు మాత్రమే సాగు చేసుకోవడానికి ఉండేది. దీంతో అసైన్ భూములు అన్యాక్రాంతం అయ్యే అవకాశం ఉండేది కాదు. ఈ ప్రక్రియ గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య జరిగింది. దీనిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**అధికారుల నియామకం..** జిల్లాలో పలు మండలాల్లో నిషేధిత ఉత్తర్వుల ఎత్తివేతలో లబ్ధిదారుల్లో పారదర్శకత ఎంత అనేదానిపై ప్రభుత్వం పునఃవిచారణ చేపట్టింది. ఇందులో భాగంగానే ప్రతి రెండు, మూడు మండలాలకు ఆర్డీవో, ఆపై స్థాయి రెవెన్యూ అధికారులను విచారణకు నియమించారు. కొద్దిరోజులుగా ఆయా మండలాల్లో అసైన్‌మెంట్ దస్త్రాల పునఃపరిశీలన జరుగుతోంది.

**వేల ఎకరాలు..** జిల్లాలో మెట్ట, మన్యం మండలాల్లోనే భూముల హక్కుల కల్పన ఎక్కువగా జరిగింది. కామవరపుకోటలో 3,222, ద్వారకాతిరుమల 2,083, చింతలపూడి 1,433, టి.నరసాపురం 1,322, నూజివీడు 1,063, ఆగిరిపల్లి 982, లింగపాలెం 836, బుట్టాయగూడెం 701, కొయ్యలగూడెం 563, పెదవేగి 516, జంగారెడ్డిగూడెం 33 ఎకరాల చొప్పున హక్కులు కల్పించారు. విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో జరగలేదు. నిడమర్రు, ఏలూరు అర్బన్, రూరల్ మండలాల్లో ఒకటి రెండెకరాలకు మాత్రమే హక్కులు కల్పించారు.

## శ్రీవారి ఆలయ ఈవోగా బాధ్యతల స్వీకరణ


ఎన్వీఎస్ఎన్ మూర్తి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ ఈవోగా నియమితులైన ఎన్వీఎస్ఎన్ మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తితిదే ఆర్జేసీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ద్వారకాతిరుమలలో పనిచేసిన వేండ్ర త్రినాథరావు సింహాచలం వెళ్లారు. ఈ సందర్భంగా దేవస్థానం మాధవ కల్యాణ మండపంలో త్రినాథరావును ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎన్వీ సుధాకరరావు, ఈఈ భాస్కర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బోధనా సిబ్బంది నియామకాలకు అడుగులు

### నిట్‌లో తీరనున్న అధ్యాపకుల కొరత

ఏపీ నిట్, (తాడేపల్లిగూడెం అర్బన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణంలోని నిట్‌లో సిబ్బంది కొరతతో సీట్లను సైతం కుదించారు. 120 సీట్లతో ప్రారంభమైన ఈ ప్రాంగణం క్రమేణా 750కు పెంచారు. అనంతరం సిబ్బంది కొరతతో 480 సీట్లకు కుదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన ఇన్‌ఛార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి బోధనా సిబ్బంది నియామకాలకు ప్రకటన విడుదల చేశారు. ఏపీ నిట్‌లో ప్రస్తుతం సుమారు 2,300 మంది విద్యార్థులు ఉన్నారు. కేంద్ర ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం 12 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలి. 202 అధ్యాపకులు ఉండాల్సి ఉండగా కేవలం 43 మంది మాత్రమే విధులు నిర్వహిస్తుండటం గమనార్హం. 222 మంది బోధనేతర సిబ్బంది ఉండాల్సి ఉండగా 69 మంది ఉన్నారు. కొన్నేళ్ల కిందట 24 మంది బోధనా సిబ్బంది నియామకాలకు ముఖాముఖీలు నిర్వహించారు. 19 మందిని విధుల్లోకి తీసుకున్నారు. తాజాగా మరో 127 మంది బోధనా సిబ్బంది నియామకానికి ప్రకటన జారీ చేశారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలో ముఖాముఖీలు జరగనున్నాయి. బోధన సిబ్బంది నియామకాలు పూర్తయిన తర్వాత బోధనేతన సిబ్బంది నియామకాలు చేపట్టనున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు జరిగితే కోల్పోయిన సీట్లను తిరిగి ప్రారంభించే అవకాశం ఉంది. "నిట్‌లో సిబ్బంది నియామకాలకు చర్యలు తీసుకున్నాం. త్వరలో అన్ని పోస్టులు భర్తీ చేసేందుకు కృషి చేస్తాం." అని నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

## సాంబారులో పిండి ముద్దలు

### నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఘటన



నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీ మెస్‌లో మంగళవారం రాత్రి విద్యార్థులకు అందించిన సాంబారులో పిండి ముద్దలు వచ్చాయి. కళాశాల ఆవరణలోని డీహెచ్ 5 మెస్‌లో భోజనం చేసేందుకు వచ్చిన విద్యార్థులకు సాంబారులో పిండి ముద్దలు కనిపించడంతో మధ్యలోనే భోజనం పడేసి వెళ్లిపోయారు. యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే పదే పదే ఇలా జరుగుతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి లక్ష్మణరావును వివరణ కోరగా.. వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## రైతు మోము మురిసేలా చేయడమే లక్ష్యం: మంత్రి


డ్రోన్‌తో పొలంలో పురుగు మందు పిచికారీ విధానాన్ని పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, పక్కన కలెక్టర్ వెట్రిసెల్వి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి.. రైతు కష్టం తీరేలా చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం సగ్గూరులో మంగళవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేసి రైతులకు తీవ్ర నష్టం చేకూర్చిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయం, యువతకు ఉపాధి కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వ్యవసాయ యంత్రాలను రైతులకు 50 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో ఆస్తి, పంట నష్టపోయిన వారికి 15 రోజుల్లోనే పరిహారం అందిస్తున్నామన్నారు. ఈ నెల 25న నష్ట పరిహారాన్ని బాధితుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ఏలూరు జిల్లాలో 5,786 మంది రైతులకు రూ.7 కోట్లు పరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ.. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనకు తీసుకోవాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులను వ్యవసాయ అధికారులు ప్రతి గ్రామానికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డ్రోన్ల ద్వారా పొలాల్లో ఎరువులు, పురుగు మందులు చల్లడాన్ని, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక, సూక్ష్మ బిందు సేద్యం శాఖల వారు ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించారు.


# వర్జీనియాకు మహర్దశ

- రికార్డు స్థాయికి ధరలు
- గరిష్ఠంగా కిలో రూ.410కి చేరటంతో రైతుల్లో ఆనందం


జంగారెడ్డిగూడెం వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్ల వాహనాలు

ఈనాడు, ఏలూరు: వర్జీనియా పొగాకుకు మహర్దశ పట్టింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉమ్మడి పశ్చిమలో ధరలు నమోదయ్యాయి. దేశంలోనే నాణ్యమైన పొగాకు కావడంతో గరిష్ఠంగా కిలో రూ.410 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ఏడాది దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర విదేశీ మారకం ద్రవ్యం కూడా పెరగనుంది. పెరిగిన ధరలతో వేలం కేంద్రాలకు వచ్చిన రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

**గతంలో ఎన్నడూ లేని విధంగా..** ప్రపంచంలో వర్జీనియా ఉత్పత్తి, ఎగుమతుల్లో బ్రెజిల్, జింబాబ్వే, చైనా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. తర్వాత స్థానంలో ఇండియా ఉంది. దేశంలో అత్యంత నాణ్యమైన పొగాకు ఉమ్మడి పశ్చిమలోనే లభిస్తోంది. ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో పంట ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ధరలు లేవు. గత సీజన్‌లో బ్రెజిల్, జింబాబ్వే భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో 30 శాతం దిగుబడి తగ్గింది. చైనాలో అక్కడి ప్రభుత్వ విధానాలతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటున్నారు. దీంతో ఉమ్మడి పశ్చిమలోని వర్జీనియాకు భారీ డిమాండ్ ఏర్పడింది. జంగారెడ్డిగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, దేవరపల్లిలోని వేలం కేంద్రాలకు వ్యాపారులు క్యూ కడుతున్నారు. గత 12 ఏళ్లలో కిలో వర్జీనియా ధర రూ.150-290 మధ్యలోనే ఉంది. ఈ సారి మాత్రం రికార్డు స్థాయిలో కిలో రూ.410 చేరింది. రూ.120 వరకు పెరిగింది. 1984లో జిల్లాలో పొగాకు బోర్డు వేలం కేంద్రాలు ఏర్పాటు కాగా ఈ స్థాయిలో ధర పలకడం ఇదే ప్రథమం.




### రూ.7 వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యం..

ఉమ్మడి పశ్చిమలో గతంలో 18 వేల హెక్టార్లలో వర్జీనియా సాగు జరిగేది. ప్రస్తుతం ఇది 21 వేల హెక్టార్లకు పెరిగింది. ఒక్కో హెక్టారుకు సగటున 2600 కిలోల వర్జీనియా దిగుబడి వస్తోంది. 16,500 వరకు పొగాకు బ్యారన్‌లు ఉన్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో రూ.2,800 కోట్ల విలువైన వర్జీనియా అమ్మకాలు జరిగాయి. ఇక్కడి నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు సముద్ర మార్గాల్లో గల్ఫ్, ఐరోపా దేశాలకు వీటిని ఎగుమతి చేస్తారు. దీని ద్వారా ఏటా రూ.6 వేల కోట్ల వరకు విదేశీ మారక ద్రవ్యం సమకూరుతోంది. ఈ ఏడాది ధర భారీగా పెరగడంతో రూ.వెయ్యి కోట్లు పెరిగి రూ.7 వేల కోట్ల వరకు చేరనుంది. దీనిపై జంగారెడ్డిగూడెం వేలం నిర్వహణాధికారి శ్రీహరి మాట్లాడుతూ..'రికార్డు స్థాయిలో ధరలు ఉన్నాయని రైతులు ఎక్కువ పెట్టుబడులు పెడితే వచ్చే ఏడాది ఈ ధరలు ఉండకపోవచ్చు.. ఇతర దేశాల్లో కొరత వల్ల ఈ స్థాయి ధరలు ఉన్నాయి. కాబట్టి పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు.



## ఏలూరులో భారీ వర్షం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో సోమవారం ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల మధ్యలో 5.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదు అయిందని ఇన్‌ఛార్జి సీపీవో బి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు అర్బన్ మండలంలో అధికంగా 41.6 మి.మీ వర్షపాతం నమోదు అయింది. ఆయా మండలాల వారీగా ఇలా. కలిదిండి 35.6, ముదినేపల్లి 22.6


ఇది మంచి ప్రభుత్వం అంటూ కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఏపీఎన్జీవో సంఘం నాయకులు, ఉద్యోగులు

## రైతులకు నాణ్యమైన గోనె సంచులు: జేసీ

భీమడోలు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా బుధవారం నుంచి రైతులకు నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయనున్నట్లు సంయుక్త కలెక్టర్ ధాత్రిరెడ్డి తెలిపారు. పాతూరులో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆమె పాల్గొన్నారు. వ్యవసాయాధికారులు, రైతులతో కలిసి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తేమ శాతం లెక్కించే పరికరాలను పరిశీలించారు. ధాన్యం రవాణాకు సంబంధించి రైతులు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని జేసీ స్పష్టం చేశారు. ఆమె వెంట డీఏస్వో సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

## 'ఇది మంచి ప్రభుత్వం'

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్‌డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులకు ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు అందిస్తుండటంతో ఇది మంచి ప్రభుత్వం అంటూ ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ వద్ద కరపత్రాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉద్యోగులు అనేక విధాలుగా ఇబ్బందులు పడ్డారని వెల్లడించారు.

## కొత్త విద్యుత్తు సర్కిళ్లకు ఎస్ఈల నియామకం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా కొత్త విద్యుత్తు సర్కిళ్లు ఏర్పాటు కానున్న నేపథ్యంలో... పశ్చిమ గోదావరి జిల్లా ఎస్ఈగా ఎ.రఘునాథబాబు నియమితులయ్యారు. ఈ మేరకు సీఎండీ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడేళ్ల కిందట జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాక.. కొన్ని శాఖలను జిల్లాల వారీగా విభజించి ఎక్కడికక్కడ కార్యాలయాలు ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బందిని కేటాయించారు. విద్యుత్తుశాఖను మాత్రం ఉమ్మడి జిల్లాల్లోనే కొనసాగించారు. దీంతో విద్యుత్తు శాఖ ఏలూరు కేంద్రంగానే పని చేస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో ఇకపై ఏలూరు, పశ్చిమ గోదావరి సర్కిళ్లుగా విడిపోనున్నాయి. తాజా బదిలీల్లో పశ్చిమ సర్కిల్‌కు సిబ్బందిని కేటాయించారు. భీమవరం డీఈ కార్యాలయాన్ని ఎస్ఈ కార్యాలయంగా మార్చి పశ్చిమ గోదావరి సర్కిల్ కార్యకలాపాలు నిర్వర్తించారు. ఈ సర్కిల్‌లో భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం సబ్ డివిజన్లు ఉండనున్నాయి. ఇక ఏలూరు సర్కిల్‌కు ఏలూరు, జంగారెడ్డిగూడెం డివిజన్లు మాత్రమే మిగిలాయి. ఇందులో కొత్తగా కృష్ణా జిల్లా గుడివాడ, నూజివీడు డివిజన్‌లోని కైకలూరు, నూజివీడు, హనుమాన్‌జంక్షన్‌ను కలపనున్నారు.

## ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** స్థానిక ఇండోర్ మైదానంలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అండర్-14, 17 విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్, కరాటే, స్కేటింగ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వెయిట్ లిఫ్టింగ్‌లో 15, కరాటేలో 40, స్కేటింగ్‌లో 36 మందిని ఎంపిక చేశారు.

**బాలబాలికల అథ్లెటిక్స్..ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** స్థానిక ఎఎస్ఆర్ మైదానంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్- 10, 12, 14, 16, 18, 20 విభాగాల్లో(పరుగు, జావెలిన్‌త్రో, హైజంప్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో) బాలబాలికల ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 420 మంది హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గుళ్ల ప్రసాదరావు, కార్యదర్శి దేవరపల్లి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఆయా క్రీడలకు సంబంధించి 110 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. అక్టోబరు 4 నుంచి 6 వరకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరుగనున్న రాష్ట్ర పోటీల్లో ఏలూరు జిల్లా తరఫున పాల్గొంటారు.



**రగ్బీ జిల్లా జట్టు.. పెదవేగి, న్యూస్‌టుడే:** స్థానిక గురుకుల బాలుర పాఠశాలలో క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్-19 రగ్బీ బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నలుమూలల నుంచి సుమారు 220 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు.

# కర్రలతో పోటీ.. వారికి వారే సాటి!

**కలిదిండి, న్యూస్‌టుడే**

### కర్రసాములో సత్తా చాటుతున్న విద్యార్థినులు

గ్రామీణ ప్రాంతాల్లో పూర్వం కర్రసాముకు ఎనలేని ప్రాధాన్యం ఉండేది. కాలక్రమంలో దీని సాధన చేసే వాళ్లు కరవయ్యారు. ఈ క్రమంలో కలిదిండి బాలికలు కర్రసాముకు మళ్లీ ఊపిరి పోస్తున్నారు. అలవోకగా చెయ్యి తిప్పుతూ.. బహుముఖ పతకాల పంట పండిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో ప్రతిభ చాటారు. తొమ్మిది జిల్లాల నుంచి 270 మంది పోటీ పడగా.. 22 మంది కలిదిండి విద్యార్థులు 40 బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

### ఆత్మ రక్షణకూ ఉపయుక్తంగా..

'కర్రసాముతో ఏకాగ్రత, శారీరక వ్యాయామం, మానసిక దృఢత్వంతోపాటు మహిళల ఆత్మ రక్షణకూ ఉపయుక్తంగా ఉంటుంది. ఈ క్రీడ అరుదుగా ఉండటంతో దీనిపై ఆసక్తి కలిగింది. మొక్కుబడిగా కాకుండా పట్టుదలతో సాధన చేయడంతో రాష్ట్ర స్థాయి పోటీల్లో ఫైట్ విభాగంలో వెండి, సింగిల్ - డబుల్ స్టిక్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించగలిగానని' పి.ప్రమోద చెబుతోంది.



### ఆడ పిల్లలెందుకు అన్నారు..

'కర్రసాము నేర్చుకుంటా అంటే మొదట్లో చాలామంది ఆడ పిల్లలెందుకు అన్నారు. అదేమీ పట్టించుకోకుండా సాధన చేయడం ప్రారంభించా. కష్టంగా అనిపించింది. అయినా.. వదల్లేదు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఫైట్ విభాగంలో బంగారు పతకం, సింగిల్, డబుల్ స్టిక్ విభాగాల్లో వెండి పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో రాణించాలనేది నా లక్ష్యం. ఆ దిశగా సాధన చేస్తున్నా..' అని జి.తేజదుర్గశ్రీ వివరించారు.



### బంగారు పతకాలు సాధిస్తా..

'ఇతర క్రీడలకంటే కర్రసాము ప్రత్యేకంగా ఉంది. దీనిలో రాణించడం చాలా కష్టం అన్నారు. ప్రయత్నిస్తే మంచి ఫలితాలు వస్తాయని అనిపించింది. అందుకే సాధన మొదలుపెట్టా. నా వల్ల కాదేమో.. పట్టుదలతో సాధన చేశా. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సింగిల్, డబుల్ స్టిక్ విభాగాల్లో కాంస్య, ఫైట్ విభాగంలో వెండి పతకం సాధించా. మరింత శ్రద్ధగా సాధన చేసి.. బంగారు పతకాలు సాధిస్తామంటూ' బి.ఏంజెల్ దీమా వ్యక్తం చేస్తోంది.



## 'మధ్యాహ్న' భోజనంపై సమీక్ష

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం తినేలా చూడాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్న భోజన పథక మెనూలో మార్పులు, చేర్పులపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎన్‌జీవోల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. కొన్నిరకాల పదార్థాలు తినేందుకు విద్యార్థులు అయిష్టత చూపడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. పలువురు స్పందిస్తూ పులిహోర, సాంబారన్నం, రాగి జావను తినడానికి విద్యార్థులు ఇష్టపడటం లేదని వారు పేర్కొన్నారు. వీటికి బదులుగా కోడి గుడ్డు వేపుడు, అన్నం, సాంబారు వేర్వేరుగా ఇస్తే బాగుంటుందని వారు సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

### వసతి గృహాల కమిటీలను బలోపేతం చేయాలి

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలో బాలికలు, మహిళలు, చిన్నారుల వసతి గృహాల పరిశీలన కమిటీలను బలోపేతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బాలల సంరక్షణ విధివిధానాల రూపకల్పనపై మంగళవారం అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ... బాలల సంరక్షణ కేంద్రాలు, బాలికల వసతి గృహాల్లో పని చేస్తున్న సిబ్బంది కదలికలను కమిటీలు గమనిస్తూ ఉండాలన్నారు. ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థల వసతి గృహాలపై గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆరుగురికి శస్త్రచికిత్సలు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** ద్వారకాతిరుమల చిన్న వెంకన్న ఆసుపత్రిలో సోమ, మంగళవారాల్లో ప్రముఖ హ్యాండ్ సర్జన్ భాస్కరానంద్ కుమార్ చేతి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 30 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. వారిలో ఆరుగురికి ఆరోగ్యశ్రీలో విజయవంతంగా శస్త్ర చికిత్సలు చేసినట్లు ఆసుపత్రి ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఆశిష్, భవ్య చంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి పాల్గొన్నారు.

## మధ్యంతర భృతి ప్రకటించాలని వినతి

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు కోరారు. నగరంలో మంగళవారం నిర్వహించిన సంఘం ఏలూరు జోన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

## బాలుర దత్తత

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లా బాలల సంరక్షణ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు బాలలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం దత్తత ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన పి.సురేందర్, విజయలక్ష్మి దంపతులకు మనోజ్‌ను, ఒడిశాకు చెందిన మేనకేతన్, సంధ్య మహారణ దంపతులకు మహేశ్‌ను దత్తత ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ... బాలలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ పద్మావతి తదితరులున్నారు.

## వైకాపా హయాంలో రైతులకు నష్టం: శ్రీనివాసవర్మ

**ఆచంట, న్యూస్‌టుడే:** జగన్ ప్రభుత్వం రైతులకు బీమా ప్రీమియం చెల్లించకపోవడం వల్ల జిల్లాలో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయినా పరిహారం పొందలేకపోయారని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విమర్శించారు. మంగళవారం ఆచంట మండలం కొడమంచిలిలో 'పొలం పిలుస్తోంది' సభలో మాట్లాడారు. రైతుల అభివృద్ధి సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని వర్మ తెలిపారు. రైతులు ఖర్చులు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవడానికి సాంకేతిక ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు వారానికి మూడు రోజులపాటు స్థానికంగా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు డ్రోన్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.



డ్రోన్ పని తీరు పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

## రూ.297 కోట్లతో రహదారుల అభివృద్ధి: మంత్రి కొలుసు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో రహదారులను రూ.297 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఆగిరిపల్లి మండలం నర్సగూరు, కొమ్మూరు, వట్టిగుడిపాడు గ్రామాల్లో రూ.35.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వం రహదారులను నిర్లక్ష్యం చేయడంతో పూర్తిగా ధ్వంసమై ప్రమాదాలకు నిలయంగా మారాయన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత రహదారి పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వై.భవానీశంకరి, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్‌మోషే, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పార్థసారథి

## విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు చూడాలని జాతీయ మానవహక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ ఎస్.విజయభారతి ఆదేశించారు. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట, భోజనశాలలు, వసతి సదుపాయం, పాఠశాల రికార్డులు, తరగతుల నిర్వహణ అంశాలను పరిశీలించారు.

## 'టెట్' పరీక్షలకు రెండు కేంద్రాలు

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** 'ఉపాధ్యాయ అర్హత పరీక్షకు (టెట్) రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు సమీపంలోని వట్లూరులో ఉన్న సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటిలో మొత్తం 5,670 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తారని అన్నారు. అక్టోబరు 3 నుంచి 21 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను ఈనెల 22న విడుదల చేశారన్నారు. http:// cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలియజేశారు. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులుంటే అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి పరీక్ష కేంద్రం వద్ద నామినల్ రోల్స్‌లో సరిచేయించుకోవచ్చన్నారు.

## పొంగిన వాగు.. కొట్టుకుపోయిన గొర్రెలు

**జీలుగుమిల్లి, న్యూస్‌టుడే:** మంగళవారం ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో నిమ్మల వ్యవధిలో జీలుగుమిల్లి సమీపంలోని వాగు పొంగి రహదారిపై ప్రవహించింది. ఆ సమయంలో అటుగా వస్తున్న తాటియాకులగూడేనికి చెందిన నంబూరు కాంతారావు సుమారు 260 గొర్రెలను నిలువరించలేకపోయారు. వాటిలో 28 కొట్టుకుపోతుంటే 18 గొర్రెలను కాపాడారు. వాగు ఉద్ధృతి మరింత పెరగడంతో మరో 10 కొట్టుకుపోయాయి. గంట వరకు వెళ్లేవారు. కాగా రహదారిపై ప్రవహిస్తున్న వాగులో వాహనదారులు అవస్థలతో పాటు తల్లిదండ్రులు కాలి నడకన దాటారు.



రహదారిపై ప్రవహిస్తున్న వాగు

## ఇకపై ప్రతి సోమవారం గిరిజన సమస్యల పరిష్కారం

**ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే:** జిల్లాలోని కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ప్రతి బుధవారం నిర్వహించే గిరిజన సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని ఇకపై ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు జేసీ పి.ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మన్యంలోని మండలాల అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ మార్పును గమనించాలని కోరారు. గిరిజన ప్రాంత ప్రజలు ప్రతి సోమవారం ఐటీడీఏ వద్ద జరిగే కార్యక్రమంలో సమస్యలను తెలపవచ్చని చెప్పారు.

## మిఠాయి దుకాణాలపై విజిలెన్స్ దాడులు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** మిఠాయిలు, తినుబండారాల్లో కృత్రిమ రంగులు కలుపుతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో విజిలెన్స్ ఎస్పీ శ్రీరాంబాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు తూనికలు, కొలతల అధికారులు కైకలూరులోని పలు మిఠాయి దుకాణాలు, బేకరీల్లో మంగళవారం తనిఖీలు చేశారు. మిఠాయిలు, తినుబండారాలు నాణ్యత పరిశీలించి కొన్ని నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కొన్ని దుకాణాల్లో తినుబండారాలు ప్యాకింగ్ చేసేందుకు అనుమతులు లేవని గుర్తించారు. నిబంధనలు సరిగాలేని కొన్ని దుకాణాలపై కేసులు నమోదు చేశారు.



దుకాణం వద్ద అధికారులు

## రెండో రోజూ విజయవాడలోనే వైద్యులు

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చలో విజయవాడ కార్యక్రమం చేపట్టిన విషయం విదితమే. మంగళవారం నిరసన కొనసాగించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు పీహెచ్‌సీ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రరావు తెలిపారు.







## అపహరణపై నీలాద్రిపురంలో ధర్నా

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** తీసుకున్న అప్పు తిరిగి చెల్లిస్తానని చెప్పి తన కుమారుడిని అపహరించారంటూ నీలాద్రిపురంలో బాధితుడి తండ్రి, బంధువులు మంగళవారం ధర్నాకు దిగారు. చేబ్రోలు పోలీసులు, బాధితుడి బంధువుల కథనం మేరకు... తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడేనికి చెందిన మాణిక్యాలరావు వెంకట్రామన్నగూడెంలో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఈయనకు నీలాద్రిపురానికి చెందిన పాస్టర్ చెన్ను సాల్మన్‌రాజు పరిచయమయ్యారు. అతని వద్ద కొంత నగదు అప్పు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించాలంటూ కోరుతున్నా, సాల్మన్‌రాజు స్పందించలేదు. సోమవారం మాణిక్యాలరావు ఫోన్ చేయగా నగదు ఇస్తానని రమ్మన్నారు. రాత్రి 10 గంటలైనా మాణిక్యాలరావు ఇంటికి రాకపోవడం, ఫోన్‌చేసినా స్పందన లేకపోవడంతో బాధిత కుటుంబ సభ్యుల్లో ఆందోళన మొదలైంది. బాధితుడి తండ్రి రామకృష్ణతో పాటు బంధువులు నీలాద్రిపురం వచ్చి సాల్మన్‌రాజు ఇంటి వద్ద ధర్నా చేశారు. సమాచారం తెలుసుకున్న చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు.

## దొంగలను పట్టారు.. సొత్తు రాబట్టారు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఇంటి యజమాని లేని సమయంలో.. తలుపు తాళాలు పగులగొట్టి చొరబడిన దొంగలు బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకెళ్లారు. ఈ కేసును 72 గంటల్లోనే ఛేదించిన పోలీసులు... ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ కేసు వివరాలు వెల్లడించారు. నూజివీడు ఎంప్లాయీస్ కాలనీలో వల్లభనేని కాశీలక్ష్మి అన్నపూర్ణ, రామకృష్ణ దంపతులు నివాసముంటున్నారు. 21న ఇంటికి తాళం వేసి ఊరెళ్లారు. ఆగంతకులు తలుపు తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి, రూ.45 వేల నగదు దోచుకెళ్లారు. ఇంటికొచ్చిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సత్యశ్రీనివాస్ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక చిన్న గాంధీబొమ్మ కూడలిలో తనిఖీలు చేస్తుండగా గోపన్నపాలెం పంచాయతీ మసీదుపాడుకు చెందిన గురువెందుల వెంకటరమణ, బొంతు నరేంద్ర అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా... తామే చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

### ప్రముఖుల ఫొటోలతో మోసం

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఇటీవల కొందరు మోసగాళ్లు ప్రముఖుల ఫొటోలు పెట్టుకుని.. వాటి ద్వారా నిధులు సేకరిస్తున్నారని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ప్రముఖులు పోస్టు చేసిన ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి వివిధ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విధంగా ఎవరైనా మభ్యపెడితే వెంటనే పోలీసు కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

## బాలల సంరక్షణ కార్యాలయం తనిఖీ

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** స్థానిక జిల్లా బాలల సంరక్షణ కార్యాలయాన్ని ఏలూరు జోన్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆర్జేడీ కె.స్వరాజ్యలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. బాలల సంరక్షణ యూనిట్, ఛైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా బాలలకు అందిస్తున్న సేవలు, పథకాలను అడిగి తెలుసుకున్నారు. డీసీపీయూ, ఛైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా రెస్క్యూ చేసిన బాలలు, వారి సంరక్షణకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. అనంతరం కార్యాలయ దస్త్రాలను పరిశీలించారు. ఆపదలోని బాలలకు అందుబాటులో ఉండాలని, వారికి అందించాల్సిన సహాయక చర్యలు, సేవలపై దిశానిర్దేశం చేశారు. ఆమె వెంట డీసీపీవో సీహెచ్ సూర్యచక్రవేణి, ఈవో అపరంజి, ఛైల్డ్‌లైన్ సమన్వయకర్త వైవీ రాజు, సిబ్బంది ఉన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు

### కానరాని వైద్య విద్యార్థి ఆచూకీ

**మారేడుమిల్లి, న్యూస్‌టుడే:** మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్ద గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. మూడో రోజైన మంగళవారం తెల్లవారుజాము నుంచే సహాయక బృందాలు గాలింపు ప్రారంభించాయి. అయితే రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాలేదు. మారేడుమిల్లిలోని జలతరంగిణి జలపాతం వద్దకు ఆదివారం వచ్చిన ఏలూరులోని ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన 14 మంది వైద్య విద్యార్థుల్లో ముగ్గురు గల్లంతైన విషయం తెలిసిందే. వారిలో ఇద్దరు విద్యార్థినుల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర విపత్తుల సహాయక బృందాలు, అటవీశాఖ సిబ్బంది, సీబీఈటీ సభ్యులు అవిశ్రాంతంగా వాగులు, వంకల వెంబడి గాలిస్తూనే ఉన్నారు.



డ్రోన్లతో చేపట్టిన గాలింపు చర్యలు పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి

**పాములేరు వెంబడి డ్రోన్లతో..** గాలింపు చర్యలను రంపచోడవరం ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, అటవీశాఖ డీఎఫ్‌వో బబిత పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులుగా జలపాతం పరిసరాలను జల్లెడ పట్టినా ఫలితం లేకపోవడంతో వాగు ప్రవాహానికి సదరు విద్యార్థి పాములేరు వాగులోకి కొట్టుకుని పోయి ఉండవచ్చనే అనుమానంతో డ్రోన్లతో వాగు వెంబడి గాలిస్తున్నారు. ఆయా వాగుల వెంబడి ఉన్న కొండల ప్రాంతాలను నిశితంగా పరిశీలించడానికి ఏఎన్ఎస్ పార్టీలను వినియోగించనున్నట్లు ఏఎస్పీ వెల్లడించారు.

**బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)**
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.




## ముఖ్యమంత్రిపై అసభ్యకర పోస్టులు

### నిందితుడి అరెస్టు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** ఎక్స్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై అసభ్యకరంగా, దూషణలతో కూడిన పోస్టింగ్‌లు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక తెదేపా నాయకుడి ఫిర్యాదు మేరకు అతడిపై జంగారెడ్డిగూడెం పోలీసులు ఆగస్టు నెలలో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా హీరాపూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించి, మంగళవారం అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం తీసుకొచ్చారు. స్థానిక కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.





**నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర**
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. **5.50** పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

# ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

## నేడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** చేబ్రోలు, ఉంగుటూరులో బుధవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు భాజపా శాసనసభ ఇన్‌ఛార్జ్ శరణాల మాలతీరాణి తెలిపారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. చేబ్రోలులో దీన్‌దయాళ్ విగ్రహానికి నివాళులర్పించి, ఉచిత వైద్యశిబిరం, మొక్కలు నాటడం, స్వచ్ఛతా హీ సేవ నిర్వహిస్తామన్నారు. ఉంగుటూరులోని గ్రీన్ ఆసియా ఇంపెక్స్ పరిశ్రమలో వంద మందికి వినికిడి యంత్రాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## చిట్టి చేతులు... గట్టి చేతలు

**గణపవరం, న్యూస్‌టుడే:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముప్పర్తిపాడు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు రూ.25,130 సేకరించారు. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయాలని చిలకంపాడులో ఎమ్మెల్యే ధర్మరాజుకు మంగళవారం నగదు అందజేశారు. విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఎంఈవో పి.శేషు, గ్రామ పెద్ద అల్లూరి బద్రీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** వరద బాధితులకు స్థానిక ప్రాథమిక పాఠశాల-1 విద్యార్థులు దాతలుగా నిలుస్తూ... రూ.11 వేలు నగదు సేకరించారు. ఈ మొత్తాన్ని డీడీ రూపంలో కలెక్టర్ వెట్రిసెల్వికి ప్రధానోపాధ్యాయుడు పెద్దిరాజు అందజేశారు.



కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రభాకర్, నాయకులు

## సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

**ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే:** అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యమిస్తూ ఎన్డీయే ప్రభుత్వం ముందుకెళుతోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మాదేపల్లిలో మంగళవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్తు ఈఈగా బాధ్యతల స్వీకరణ

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు అందించడమే ధ్యేయంగా కృషి చేస్తామని ఈఈ అంబేడ్కర్ అన్నారు. స్థానిక విద్యుత్తు భవన్‌లో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరంలో ఈఈగా పని చేస్తూ... బదిలీపై ఇక్కడకొచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఈఈగా విధులు నిర్వహించిన నటరాజన్‌ను రాజమహేంద్రవరం బదిలీ చేశారు.

## బొరగం శ్రీనివాస్‌కు ఎంపీ అభినందన

**ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే:** ఏపీ గిరిజన ఆర్థిక సహకార సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన బొరగం శ్రీనివాస్‌కు ఎంపీ మహేశ్ కుమార్ అభినందనలు తెలిపారు. తెదేపాను నమ్ముకొని అంకితభావంతో పని చేస్తున్న శ్రీనివాస్‌కు పార్టీ అధిష్ఠానం తగిన గుర్తింపునిచ్చిందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

✷ ఏలూరు నగరం పవరుపేటలోని రైల్వే గేటు పుర వాసులకు నరకం చూపుతోంది. ప్రతి అరగంటకోసారి గేటు పడుతోంది. ప్రధాన మార్గం కావడంతో.. రెండువైపులా అర కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కోసారి కాలు కదపడానికీ వీల్లేకుండా నిరీక్షించాల్సిన పరిస్థితి.



ఉంగుటూరు రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

✷ ఉంగుటూరులోని రైల్వే గేటు వద్ద వాహనదారుల అవస్థలు వర్ణనాతీతం. ఒకసారి గేటు పడితే ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. ఈ ప్రభావం జాతీయ రహదారిపై పడుతోంది. భీమడోలు రైల్వే గేటు వద్ద ఇదే దుస్థితి.

# ఫలిస్తున్న నిరీక్షణ..!

✪ రైల్వే పైవంతెనల నిర్మాణాలకు అడుగులు
✪ సర్వే ప్రారంభించిన అధికారులు

ఉంగుటూరు, న్యూస్‌టుడే

ప్రజల నిరీక్షణ ఫలిస్తోంది. జిల్లాలోని రైల్వే గేట్ల పై, కింద వంతెనల నిర్మాణాలకు అడుగులు పడుతున్నాయి. వీటి ఏర్పాటుకు రైల్వేశాఖ నిధులు సమకూర్చనుంది. జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైల్వే గేట్లు ఉన్నాయి. ఇక్కడ తరచూ గేట్లు పడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల గేట్లు దాటుకెళుతూ పలువురు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కోకొల్లలు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ లెవెల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్వోబీ(రోడ్డు ఓవర్ బ్రిడ్జి), ఆర్‌యూబీ(రోడ్డు అండర్ బ్రిడ్జి) నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది.

**విస్మరించిన వైకాపా**

గత వైకాపా ప్రభుత్వం పైవంతెనల నిర్మాణాన్ని విస్మరించింది. తాజాగా ఎన్డీయే ప్రభుత్వం పైవంతెనల ఏర్పాటుపై దృష్టి సారించింది. ఈ నిర్మాణాలయ్యే మొత్తం ఖర్చును రైల్వే శాఖ వెచ్చించనుంది. ఉంగుటూరు, కైకరం, పూళ్ల, భీమడోలు, సీతంపేట, పవరుపేటలో ఆర్వోబీలు నిర్మించనున్నారు. ఉంగుటూరు, కైకరంలో రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, జలవనరుల, జాతీయ రహదారి అథారిటీ, విద్యుత్తు శాఖలతో రైల్వే అధికారులు ఉమ్మడి సర్వే చేపట్టారు.

**ఒక్కో దానికి మూడు..**

సికింద్రాబాద్ రైల్వే శాఖ ప్రధాన కార్యాలయం ఇంజినీరింగ్ అధికారులు ఒక్కో పైవంతెనను మూడు చోట్ల నిర్మించేందుకు వీలుగా నమూనాలు సిద్ధం చేశారు. ప్రధానంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సూచనల మేరకు మూడింట్లో ఒక నమూనా ఎంపిక చేస్తారు.. భూసేకరణ, విద్యుత్తు స్తంభాల మార్పు, తాగునీరు చెరువులు, పైపులైన్లకు ఎక్కడైనా ఇబ్బంది కలుగుతుందా.. లేదానని పరిశీలించనున్నారు.

**నమూనాలకు అనుగుణంగా భూ సర్వే**

రైల్వే ఇంజినీరింగ్ అధికారులు రూపొందించిన మూడు నమూనాల ప్రకారం భూ సర్వే చేపడతాం. ఆర్వోబీల నిర్మాణానికి ప్రభుత్వ భూమి ఎంతమేర ఉంది, ప్రైవేటు భూమి ఎంత అవసరం, వీటిలో వ్యవసాయ భూములు, భవనాలు ఎన్ని ఉన్నాయి, వాటి సర్వే నంబర్లు తదితర వివరాలు సేకరిస్తాం.

– ఖాజావలి, ఆర్డీవో, ఏలూరు

**ఖర్చంతా రైల్వే శాఖదే**

ఆర్వోబీల నిర్మాణాలకయ్యే మొత్తం వ్యయాన్ని రైల్వే శాఖ భరిస్తుంది. మొదటి దశలో ఏలూరు జిల్లాలో ఆరు పైవంతెనల నిర్మాణానికి రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది.

– శశిభూషణ్, సీనియర్ సెక్షన్ ఇంజినీరు(పీవే)

**మేమున్నాం.. మీకు తోడుగా..** 10 AM to 1 PM

| | |
|---|---|
| ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535 |
| పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492 |

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

**సమస్య:** తంగెళ్లమూడి జిల్లా పశువుల ఆసుపత్రి రోడ్డులో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. రోజుల తరబడి మురుగు పేరుకుపోవడంతో దుర్వాసన రావడంతో పాటు దోమల మోత భరించలేకున్నాం. **- కె.నారాయణరావు, స్థానికుడు**

**సమాధానం:** పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

**సమస్య:** వంగాయగూడెం సుబ్రహ్మణ్యం కాలనీ రోడ్డులో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రివేళ బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నాం. **- శ్రీనివాసరావు, స్థానికుడు**

**సమాధానం:** సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరిరావు, విద్యుత్తు ఏఈ**

**సమస్య:** కొత్తపేట నూకాలమ్మ ఆలయం వెనుక రోడ్డులోని మురుగు కాలువలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. దీంతో దుర్వాసన రావడంతో పాటు రాత్రివేళ దోమల బెడదతో కంటిమీద కునుకు వేయలేక పోతున్నాం. **- సీహెచ్ రామారావు, స్థానికుడు**

**సమాధానం:** కాలువలో చెత్తాచెదారాలు తొలగిస్తాం. దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**



భీమడోలు: కరపత్రం అందజేస్తున్న గన్ని తదితరులు

## స్వర్ణాంధ్ర కలను సాకారం చేద్దాం

**భీమడోలు, న్యూస్‌టుడే:** స్వర్ణాంధ్రప్రదేశ్ కలను సాకారం చేసేందుకు ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుండుగొలనులో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పంచిపెట్టారు. నాయకులు శిరిబత్తిన కొండబాబు, ప్రత్తి మదన్, పట్నాల వెంకటేశ్‌బాబు, పుల్లయ్యనాయుడు, రామతులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

**భీమడోలు:** రాష్ట్రంలో గాడితప్పిన వ్యవస్థలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టాలెక్కిస్తున్నారని తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. కురెళ్లగూడెం, వడ్లపట్ల గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు కొండబాబు, పుల్లయ్యనాయుడు, రామతులసమ్మ, శ్యామల, బుజ్జిగోపాల్ పాల్గొన్నారు.

**గణపవరం:** గణపవరంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ధర్మరాజు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల పాలనపై అవగాహన కల్పించారు. సర్పంచి మూర అలంకారం, నాయకులు రామకృష్ణంరాజు, సురేంద్ర, శ్రీను, సునీత, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**గణపవరం, న్యూస్‌టుడే:** రైతే రాజు నినాదాన్ని సాకారం చేసేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. చిలకంపాడులో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, సామూహిక ఎలుకల నివారణ, నమో డ్రోన్ దీదీ పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వ్యవసాయాధికారులు మురళీకృష్ణ, వైవీఎస్ ప్రసాద్, నాయకులు రామకృష్ణంరాజు, తోట శ్రీను, యాళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**భీమడోలు:** కురెళ్లగూడెంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**ఏలూరు గ్రామీణ:** మల్కాపురం, చొదిమెళ్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎ.జీవన సంధ్య పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. పశువైద్యాధికారి స్వరూప, ఉద్యానాధికారి కరణ్, మార్కెటింగ్ శాఖ సూపర్‌వైజర్ బేబి, నాయకులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేస్తాం

'పొలం పిలుస్తోంది' ప్రారంభం



గణపవరం: డ్రోన్ పనితీరును తెలుసుకుంటున్న ధర్మరాజు

**నాచుగుంట(ఉంగుటూరు):** నాచుగుంటలో ఏవో ఎన్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి ఏలేటి సునీత, ఎంపీటీసీ సభ్యురాలు గంటా ఉషారాణి, నాయకులు గంగాధర్‌రావు, వెంకటేశ్వరరావు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

**పెదవేగి:** కె.కన్నాపురం, తాళ్లగోకవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఏవో ముత్యాల ప్రియాంక పాల్గొని రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ ఏవో రత్నమాల, సర్పంచి నెక్కంటి సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు రాజారత్నం పాల్గొన్నారు.

**పెదపాడు:** కలపర్రు, కొక్కిరపాడు గ్రామాల్లో ఏవో ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది జరిగింది. వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వాడకం తదితరాలను రైతులకు వివరించారు.

## సమాజ సేవలో భాగస్వాములుకండి

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రధానాచార్యుడు టీకే విశ్వేశ్వరరావు అన్నారు. నారాయణపురంలోని శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ✷ కళాశాలలో బాలల హక్కుల న్యాయవాద ఫౌండేషన్ ఆధ్వర్యాన బాల్య వివాహాలు- అనర్థాలపై అవగాహన కల్పించారు. సామాజిక కార్యకర్త చమటపల్లి రేఖ హాజరై బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

**ఏలూరు విద్యా విభాగం:** సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ విష్ణుమోహన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశంపై అభిమానం, ప్రజలపై సేవా భావం కల్పించడమే ఎన్ఎస్ఎస్ ఉద్దేశమన్నారు. ప్రధానాచార్యుడు రామరాజు, ఉప ప్రధానాచార్యుడు విశ్వేశ్వరరావు తదితరులున్నారు.

**గణపవరం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. ప్రధానాచార్యురాలు నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉప ప్రధానాచార్యుడు మధురాజు, చైతన్య, వెంకటరమణ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికడదాం

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** స్థానిక సెయింట్ థెరిసా జూనియర్ కళాశాలలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కైలాశ్ సత్యార్థి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సదస్సు జరగ్గా- పిల్లల హక్కుల జిల్లా సమన్వయకర్త ఎస్.రవిబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

## ఉంగుటూరు ఎంపీడీవోగా రాజ్ మనోజ్

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ఉంగుటూరు ఎంపీడీవోగా గంజి రాజ్ మనోజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెదవేగి నుంచి బదిలీపై వచ్చారు. ప్రస్తుత ఎంపీడీవో ప్రేమాన్విత పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి బదిలీ అయ్యారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, కార్యాలయ సిబ్బంది రాజ్ మనోజ్‌ను కలిసి అభినందించారు.

## మందుల వినియోగంపై అవగాహన

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో నాలుగో జాతీయ ఫార్మకో విజిలెన్సు వారోత్సవాలు నిర్వహించారు. నగరంలో వివిధ కళాశాలకు చెందిన ఆచార్యులు, ఫార్మాకాలజీ వైద్యులు, విద్యార్థులు మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రభుత్వాసుపత్రి రోగులు, సెయింట్ థెరిసా పాఠశాల విద్యార్థినులకు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధానాచార్యుడు డాక్టర్ శశిధర్, ఉప ప్రధానాచార్యుడు భాస్కర్, విభాగాధిపతి డాక్టర్ పద్మావతి, ఆచార్యులు విజయకుమారి, రాజసులోచన పాల్గొన్నారు.

## ఇంటెలిజెన్స్ డీఎస్పీగా సుధాకరరావు

**ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** ఏలూరు జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఎం.సుధాకరరావును నియమితులయ్యారు. ఈయన ఇప్పటి వరకు నిరీక్షణ జాబితాలో ఉన్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి డీజీపీ కార్యాలయం ఉత్తర్వు జారీ చేసింది.

**ఏలూరు సినిమాలు**

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

| | |
|---|---|
| అంబిక డీలక్స్ | కమిటీ కుర్రోళ్లు |
| అంబిక మినీ | ఆయ్ |
| అంబిక లిటిల్ | ---------- |
| సాయిబాలాజీ | గొర్రె పురాణం |
| బాలాజీ | ప్రేమికుడు |
| సత్యనారాయణ స్క్రీన్ 1 | బొమ్మరిల్లు |
| సత్యనారాయణ స్క్రీన్ 2 | మత్తు వదలరా 2 |
| సత్యనారాయణ స్క్రీన్ 3 | ఏఆర్ఎం |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 1 | ఉత్సవం |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 2 | 35 చిన్న కథ కాదు |
| విజయలక్ష్మి వీమ్యాక్స్ 3 | గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1 | సరిపోదా శనివారం |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2 | గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3 | ఏఆర్ఎం |
| ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4 | మత్తు వదలరా 2 |

# మందుబాబుల బజారు.. జనం బేజారు!

పెదపాడు ప్రజల సౌకర్యార్థం గత తెదేపా ప్రభుత్వ హయాంలో మినీ రైతుబజారు నిర్మించారు. రూ.10 లక్షల వ్యయంతో పది దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ దుకాణాల నిర్వహణకు రైతులెవరూ ముందుకు రాలేదు. దాంతో ఏళ్ల తరబడి నిరుపయోగంగా మారింది. చీకటిపడితే దుకాణాల దిమ్మెలపై మందుబాబులు కూర్చొని మద్యం తాగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఆవరణలో ఎటుచూసినా తాగిపడేసిన మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా అటువైపు వెళ్లేందుకు మహిళలు భయపడుతున్నారు. వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ మహేంద్రనాథ్ మాట్లాడుతూ.. మినీ రైతుబజారును వాణిజ్య సముదాయంగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామన్నారు. **- ఈనాడు, పెదపాడు**



పెదపాడులో నిరుపయోగంగా మినీ రైతుబజారు



తాగి పడేసిన మద్యం సీసాలు, గ్లాసులు

## వాయుపుత్రుని దర్శనానికి బారులు

**అప్పనవీడు (పెదపాడు), న్యూస్‌టుడే :** అప్పనవీడు అభయాంజనేయస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు, విశేషనామార్చనలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన తవ్వ పూర్ణచంద్రరావు, నాగవెంకటదుర్గా దంపతుల ఆర్థిక సహాయంతో అన్నసమారాధనను నిర్వహించారు.



**కొనసాగుతున్న హోమం.. ఏలూరు గ్రామీణ:** దొండపాడులోని శ్రీనం దత్తనాథక్షేత్రంలో దత్తమూల మంత్ర హోమం కొనసాగుతోంది. వేద పండితులు శాస్త్రోక్తంగా హోమ క్రతువు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు దత్తాత్రేయస్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



## ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక 12వ డివిజన్ దక్షిణపు వీధి మార్కండేయ ఆలయ సమీపంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తొలుత ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు, స్టిక్కర్లను ఇంటింటికీ వెళ్లి అంటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... నిబద్ధతతో రాజకీయాలు చేయడమే తనకు తెలుసన్నారు. నాయకులు ఎస్కే మీరా, ఆంజనేయులు, పెదబాబు, శివప్రసాద్, బలరామ్, వెంకటరత్నం, కాశి నరేశ్, రాంబాబు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు

**గణపవరం, న్యూస్‌టుడే:** పిప్పరలో మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు 89వ జన్మదినాన్ని అఖిలపక్ష నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరికుమార్ రాజు, వివిధ పార్టీ నాయకులు రామకృష్ణంరాజుతో కేక్ కోయించి అభినందనలు తెలిపారు. తన తండ్రి నిర్మించిన పిప్పర ఉన్నత పాఠశాల అభివృద్ధికి మాజీ మంత్రి రూ.లక్ష విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని ప్రధానోపాధ్యాయుడు జె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. నాయకులు ఐ.వి.నరసింహరాజు, దండు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్ష విరాళమిస్తున్న మాజీ మంత్రి రామకృష్ణంరాజు

## జ్యోతిరావు ఫులే సేవలు ఎనలేనివి

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** మహాత్మా జ్యోతిరావు ఫులే అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఫులే దంపతులు ఏర్పాటు చేసిన సత్యశోధన సమాజం వార్షికోత్సవాన్ని స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధికి ఫులే దంపతులు ఎంతో శ్రమించారని ప్రశంసించారు.

## నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

**ఉంగుటూరు, న్యూస్‌టుడే:** ఉపాధి హామీ పథకం (నరేగా)లో భాగంగా 27 పంచాయతీల్లో చేపట్టిన పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్ తెలిపారు.

## 'థాలి బజావో' కార్యక్రమం

**ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు బుధవారం 'థాలి బజావో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్నందున... ఎన్నికల హామీలను గుర్తు చేసేందుకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలపనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**అవి ఇవి అన్నీ**

## పోషకాలతో ఆరోగ్యం

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే :** పోషకాహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ పీడీ కేవీఎల్ పద్మావతి అన్నారు. గాంధీనగర్ మున్సిపల్ పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో పద్మావతి అధ్యక్షత వహించారు. చైల్డ్ రైట్స్ సభ్యుడు రాజేంద్ర ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.



మాట్లాడుతున్న రాజేంద్ర

**పెదపాడు:** పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు శ్రద్ధ చూపాలని మలేరియా జిల్లా సహాయాధికారి జె.గోవిందరావు సూచించారు. గోగుంటలో మంగళవారం ఆయన పర్యటించారు. ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించారు.

## ఇళ్ల పట్టాల మంజూరుకు డిమాండ్

**ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే:** కుమ్మరిరేవులో ప్రజలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం కార్యదర్శి జి.ఏసుబాబు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మహాసభ నిర్వహించారు.

## సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

**ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే:** వర్తక వ్యాపారులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానికంగా ఓ కల్యాణ మండపంలో మంగళవారం వర్తక వాణిజ్య సంఘాల నాయకులు, దుకాణాల యజమానులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... బంగారు దుకాణాల్లో వస్తువులను తాకట్టు పెట్టేందుకు వచ్చిన వారి వివరాలు నమోదు చేయాలన్నారు. తక్కువకు తాకట్టు పెట్టిన, అమ్మిన వారిపై నిఘా ఉంచాలన్నారు. దుకాణ సముదాయాల వద్ద వాహన రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. వర్తక సంఘం గౌరవాధ్యక్షుడు రామారావు, అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదనరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పని సర్దుబాటులో లోపాలు సరిదిద్దాలి

**ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే:** నగర పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల పని సర్దుబాటులో జరిగిన లోపాలను సరిచేయాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘ జిల్లా కార్యదర్శి శివశంకరరావు, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ పర్వీన్ బేగం, జె.రాజారావు తదితరులు ఏలూరు ఎంఈవో-1, 2 రవిప్రకాశ్, రంగయ్యలకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ నగరంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమక్షంలో జీవో ప్రకారం ఉపాధ్యాయులను కౌన్సెలింగ్ ద్వారా సర్దుబాటు చేసినప్పటికీ ఏడుగురు కోరుకున్న పాఠశాలలకు కాకుండా మరో పాఠశాలలో చేరారని ఆరోపించారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఫ్రీజ్ అయిన తర్వాత మార్పులు ఏవిధంగా జరిగాయో తేల్చాలని కోరారు. దీనిపై సరైన వివరణ ఇవ్వకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని అన్నారు.

# పోలవరం

•పోలవరం • చింతలపూడి

## మద్ది క్షేత్రంలో విశేష పూజలు



**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రభాతసేవ, నిత్యార్చనతో పాటు తమలపాకులతో అష్టోత్తర పూజలు చేశారు. స్వామి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ఆలయ ముఖ మండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## మన్యంలో భారీ వర్షం

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మన్యం ప్రాంతంలో మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి సుమారు మూడు గంటల పాటు భారీ వర్షం కురిసింది. బుట్టాయగూడెం మండలం అలివేరు వద్ద గుబ్బలమంగమ్మ జల్లేరు జలాశయంలోకి 650 క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరుతోంది. నీటిమట్టం 217 మీటర్లకు పెరిగింది. దీంతో జలాశయం రెండు గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ ఏఈ సురేశ్ తెలిపారు.

**పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం మండలం ఎల్ఎన్డీపేట, ప్రగడపల్లి, వింజరం, ఇటుకలకోట, పోలవరం, పట్టిసీమ, గూటాల, కొత్తపట్టిసీమ పంచాయతీల్లో మంగళవారం కుండపోత వర్షం కురిసింది.

## ద్వారకా తిరుమలకు పాదయాత్ర

**కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** తిరుమలలో ప్రసాదాలు అపవిత్రమైనందుకు పాప నిర్మూలన కోసం కొయ్యలగూడెం నుంచి ద్వారకాతిరుమలకు కాత్యాయని పీఠం వ్యవస్థాపకుడు దాసరోజు శ్రీనివాసరావు మంగళవారం పాదయాత్ర చేపట్టారు.

## వరసిద్ధి వినాయకుడి సేవలో బొరగం

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు కన్నాపురంలోని వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ప్రభుత్వం ఆయన్ని ట్రైకార్ ఛైర్మన్‌గా నియమించినట్లు ప్రకటన వెలువడగానే కూటమి పార్టీల శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. పోలవరం మండలం ఎల్ఎన్డీపేటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన బొరగం అక్కడి నుంచి కన్నాపురం చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యకర్తలు, అభిమానులు బొరగంను అభినందనలతో ముంచెత్తారు.

## వినతుల పరిష్కారానికి కృషి

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** ప్రధాన మంత్రి జన్‌మన్ కార్యక్రమ గ్రామ సభల్లో వచ్చిన వినతుల పరిష్కారానికి కృషి చేయాలని ఐటీడీఏ ఏపీవో, ఇన్‌ఛార్జి డీడీ పీవీఎస్ నాయుడు అన్నారు. కేఆర్ పురం ఐటీడీఏ వద్ద మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమై, గ్రామ సభల్లో వచ్చిన అర్జీలు, ప్రతిపాదనలను గ్రామాల వారీగా సమీక్షించారు. జిల్లా నోడల్ అధికారి మడి నాగేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** బుట్టాయగూడెం తహసీల్దార్‌గా చలపతిరావు బాధ్యతలు స్వీకరించారు.

## రెండో వైద్యాధికారిణి నియామకం

**పోలవరం, న్యూస్‌టుడే:** ఎల్ఎన్డీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండో వైద్యురాలిగా సుష్మ బాధ్యతలు స్వీకరించారు.

## కేసు నమోదు చేయాలంటూ ధర్నా

**లింగపాలెం, న్యూస్‌టుడే:** దాడికి గురైన వ్యక్తి ఏలూరు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్నా.. నిందితులపై కేసు నమోదు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని యాదవ సంఘం నాయకులు ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ధర్నా చేశారు. ముడిచర్లకు చెందిన గోలి శ్రీనుపై అదే గ్రామానికి చెందిన బాల ప్రసాద్ ఈ నెల 22న దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీనిపై ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న మాట్లాడుతూ నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# పేరుకే పెద్దాసుపత్రి..!

### వైద్యుల కొరతతో రోగులకు పూర్తిస్థాయిలో అందని సేవలు

**చింతలపూడి, న్యూస్‌టుడే:**

నిత్యం సుమారు 400 మంది బయట, 20 మంది ఆసుపత్రిలో ఉండి చికిత్స పొందే రోగులతో రద్దీగా ఉండే చింతలపూడి ఏరియా ఆసుపత్రిని ఏళ్లుగా వైద్యుల కొరత వేధిస్తోంది. 100 పడకల ఆసుపత్రి భవనాలు పూర్తి కాకపోవడంతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్నే ఏరియా ఆసుపత్రిగా మార్చి సేవలందిస్తున్నారు. చింతలపూడి నుంచే కాకుండా నూజివీడు నియోజకవర్గంలోని చాట్రాయి, ముసునూరు మండలాలకు చెందిన రోగులు చికిత్సల కోసం ఇక్కడికి వస్తుంటారు.

**ప్రధాన పోస్టులు ఖాళీ**

ప్రసూతి, చిన్న పిల్లల వైద్యుడు, శస్త్ర చికిత్సల నిపుణులు 2, చెవి, ముక్కు, గొంతు, కంటి వైద్యుడు లాంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం మత్తు వైద్యులు ఇద్దరు, ఎముకలు, చర్మ వ్యాధులు, జనరల్ మెడిసిన్‌తో పాటు మరో ముగ్గురు ఎంబీబీఎస్‌లు మాత్రమే ఆసుపత్రిలో సేవలందిస్తున్నారు. వైద్యుల సంఖ్య తక్కువగా ఉండటంతో నిత్యం ఒక్కొక్కరు 60 మందికి పైగా ఓపీ చూడాల్సి వస్తోంది. రోగుల ఆరోగ్య వివరాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు కూడా సమయం సరిపోవడం లేదు.



ఓపీ కోసం నిల్చున్న రోగులు

**డిప్యుటేషన్లే దిక్కు**

ప్రసూతి వైద్యుల కొరత ఏళ్లుగా ఆసుపత్రిని వెంటాడుతోంది. ఇక్కడికి వచ్చిన వారు పట్టుమని ఐదు నెలలు కూడా పనిచేయడం లేదు. దీంతో జిల్లాలోని వేరే ప్రాంతాల నుంచి ఇక్కడికి రెండు రోజులు సేవలందించేలా డిప్యుటేషన్ వేస్తున్నారు. ప్రస్తుతం ప్రసూతితో పాటు పిల్లల వైద్య నిపుణులు వారానికి రెండు రోజులు సేవలందిస్తున్నారు. ప్రజలకు ఈ సేవలపై సరైన సమాచారం లేక పొందలేకపోతున్నారు. ఆసుపత్రిలో 24 మంది స్టాఫ్ నర్సులు ఉండటంతో నెలకి 10 నుంచి 15 సాధారణ ప్రసవాలు ఆసుపత్రిలో చేస్తున్నారు. సిజేరియన్ అయితే వేరే ఆసుపత్రులకు సిఫార్సు చేస్తున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

ఆసుపత్రిలో ప్రస్తుతం తొమ్మిది మంది వైద్యులు సేవలందిస్తున్నారు. కొరత అయితే ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం'అని సూపరింటెండెంట్ ఎ.నారాయణరావు తెలిపారు.

**అర్బన్ ఆసుపత్రిగా మార్చడంతో..**

చింతలపూడి ఆసుపత్రిని అర్బన్ ఆసుపత్రిగా మార్చడంతో ఇక్కడ పనిచేసేందుకు యువ వైద్యులు ఆసక్తి చూపడం లేదు. ఏజెన్సీలో రెండేళ్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు, అర్బన్ ప్రాంతాల్లో అయిదేళ్లు సర్వీసు పూర్తి చేస్తే ఎంబీబీఎస్ వైద్యుల పోస్టు గ్రాడ్యుయేషన్‌కు వైద్య ఆరోగ్య శాఖ సడలింపు ఇస్తుంది. ఈ నిబంధన కూడా యువ వైద్యులు చింతలపూడి వచ్చేందుకు ఆసక్తి చూపకపోవడానికి కారణమవుతోంది. ఏజెన్సీ, రూరల్‌లో పనిచేస్తే రూ.20 వేల నుంచి రూ.30 వేలు అదనపు జీతభత్యం కూడా ఇస్తుండటంతో అర్బన్ ఆసుపత్రులంటేనే ఆమడ దూరం వెళ్తున్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం : 80085 74947
చింతలపూడి : 76759 19086

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే**

**సమస్య:** చింతలపూడి బోయగూడెం ఎస్సీ బాలుర వసతి గృహం వీధిలో మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పనులు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. -రాజయ్య, స్థానికుడు

**సమాధానం:** పరిశీలించి మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం. -రాజా, సచివాలయాల కార్యదర్శి

## పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న ఆర్డీవో అద్దయ్య

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని పొగాకు వేలం నిర్వాహణాధికారి సురేంద్ర అన్నారు. జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రం-2లో మంగళవారం 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఆవరణను శుభ్రం చేశారు. వేలం కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ● 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమంలో భాగంగా అక్టోబరు నెలాఖరుకు జంగారెడ్డిగూడెం పట్టణంలో 300 ఇళ్ల పూర్తిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె.అద్దయ్య అన్నారు. పురపాలక కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న 'ఇది మంచి ప్రభుత్వం', 'స్వచ్ఛతా హీ సేవా', 'మన ఇల్లు - మన గౌరవం' తదితర కార్యక్రమాల అమలు, వాటి లక్ష్యాలను వివరించారు. పురపాలక కమిషనర్ నరేంద్రకుమార్, మేనేజర్ వెంకటరమణ, ఏఈ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్యం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి



గుండుగూడెంలో మాట్లాడుతున్న కృష్ణచైతన్య

**కుక్కునూరు, న్యూస్‌టుడే:** మన్యం ప్రాంతంలోని అనేక గ్రామాల్లో నేటికీ మౌలిక వసతులు లేవని సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య అన్నారు. మంగళవారం కుక్కునూరు మండలం గుండుగూడెంలో నిర్వహించిన సీపీఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కుక్కునూరు మండలం కురుములతోగులో అతిసారం ప్రబలి, పలువురు అస్వస్థతకు గురి కాగా అందులో ఇద్దరు మృత్యువాత పడటం గిరిజన గ్రామాల దుస్థితికి దర్పణం పడుతోందన్నారు. గిరిజన ఉప ప్రణాళిక నిధులు వెచ్చించి గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వెంకటాచారి, సురేశ్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** చింతలపూడి మండలం రేచర్లలో సీపీఐ నాయకులు సమావేశమయ్యారు. సీపీఐ మండల కార్యదర్శి గురవయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు పాలన వదిలేసి తిరుమల లడ్డూపై సమయం వృథా చేస్తున్నారని ఆరోపించారు. బాబు, కృష్ణ, చెంచయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా నివారణపై మరింత అవగాహన

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మన్యం గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా మరింత అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా నివారణాధికారి ప్రసాద్ కోరారు. బుట్టాయగూడెం మండలం రెడ్డిగూడెంలో మూడో విడత మలాథీయాన్ మందు పిచికారీని మంగళవారం పరిశీలించారు. ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీహెచ్ఈవో పందిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా భావం అలవరుచుకోవాలి

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవరుచుకోవాలని జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్‌బాబు అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవం యూనిట్-1, 2 ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు నిట్టా వినయ్, గల్లా శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే:** చింతలపూడి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అనాథలకు ఆహార పదార్థాలను విద్యార్థులు అందజేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొవ్వాడ జలాశయం నుంచి నీటి విడుదల

**పోలవరం, న్యూస్‌టుడే:** భారీ వర్ష సూచన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం సాయంత్రం ఎల్ఎన్డీపేట కొవ్వాడ జలాశయం రెండు గేట్ల నుంచి 480 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పర్యవేక్షణ ఏఈ రాహుల్ చెప్పారు. ప్రస్తుతం జలాశయం వద్ద నీటిమట్టం 89.80 మీటర్లుగా ఉందన్నారు.

## గ్రామాల అభివృద్ధే సర్కారు ధ్యేయం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటరాజు

**ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే:** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మారంపల్లి, జాజులకుంట, రాజుపాలెం, తిరుమలంపాలెం, గొల్లగూడెం, పి.కన్నాపురం, బుట్టాయగూడెం, సత్తాల తదితర గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్షోభంలోనూ సంక్షేమ కార్యక్రమాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో లంకా సత్యనారాయణ, మద్దిపాటి రత్నాజీ, బొబ్బిలి బాబూరావు, లింగంకుంట నర్సయ్య పాల్గొన్నారు.

## గిరిజనులకు హక్కు పట్టాలివ్వాలి

**బుట్టాయగూడెం, న్యూస్‌టుడే:** మన్యంలో ప్రభుత్వ, పోరంబోకు, ఏడబ్ల్యూడీ, గయ్యాళి భూముల్లో సాగులో ఉన్న గిరిజనులకు చట్టాలకు అనుగుణంగా హక్కు పట్టాలివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన నేతృత్వంలో నాయకుల బృందం తహసీల్దారు చలపతిరావుకు మంగళవారం వినతిపత్రం అందజేసింది. జిల్లా కమిటీ సభ్యుడు ఫ్రాన్సిస్, కారం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎన్డీయే ప్రభుత్వంలో వ్యవసాయానికి పెద్దపీట



ఆడమిల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రోషన్‌కుమార్, గన్ని

**కామవరపుకోట (జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే:** ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నట్లు తెదేపా ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. కామవరపుకోట మండలం ఆడమిల్లిలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ.. పంటల సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా ప్రభుత్వం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. పలు వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంటా మురళి, సర్పంచి గూడపాటి కేశవరావు, పారేపల్లి రామారావు, కిలారి సత్యనారాయణ, గుత్తా సత్యసాయివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం, టెక్కినవారిగూడెంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సాయిల సత్యనారాయణ, కుక్కల మాధవరావు, ఆకుల రాకేశ్, పారేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కుక్కునూరు, వేలేరుపాడు, న్యూస్‌టుడే:** కుక్కునూరులో నిర్వహించిన కార్యక్రమంలో పత్తి పంటలో చీడపీడల నివారణ, పెట్టుబడులు ఆదా వంటి అంశాలను వివరించారు. వ్యవసాయాధికారి బాలాజీ, నాయకులు నాగేశ్వరరావు, సత్యనారాయణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ● వేలేరుపాడు మండలం మేడిపల్లిలో వ్యవసాయాధికారిణి సమీరజా రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** సేంద్రియ సాగుతో మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు అన్నారు. అచ్యుతాపురం, పొంగుటూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో వరి పైరులో ఎండాకు, ఆకు ముడత తెగుళ్లను గుర్తించి వాటి నివారణకు సూచనలు చేశారు. పొంగుటూరులో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి కషాయాల తయారీపై అవగాహన కల్పించారు.

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** ఈపంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని చింతలపూడి ఏడీఏ నాగకుమార్ అన్నారు. వల్లంపట్లలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

**లింగపాలెం, న్యూస్‌టుడే:** యడవల్లి, టీసీహెచ్ఆర్‌పాలెం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

**చింతలపూడి, న్యూస్‌టుడే:** రాఘవాపురం ఏవో మీనాకుమారి రైతులకు సస్యరక్షణ చర్యలు వివరించారు. మాటూరి వెంకట్రామయ్య, మాటూరి అనిల్, చిన్నంశెట్టి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# 'అప్పులున్నా.. రెట్టింపు సంక్షేమం'



ఎల్ఎన్డీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు



బోడిగూడెంలో..



జంగారెడ్డిగూడెంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కూటమి నాయకులు

**జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. పట్టణంలోని 5, 6 సచివాలయాల పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ సభలు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మండవ లక్ష్మణరావు, పెనుమర్తి రామ్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమాదేవి, అల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● లక్కవరం, టెక్కినవారిగూడెం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాల్లో నాయకులు సాయిల సత్యనారాయణ, కుక్కల మాధవరావు, ఎలికే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ● అక్కంపేటలో ఇంటింటికి తిరిగి 100 రోజుల్లో ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు తారిపిరెడ్డి నాగప్రసాద్, గంధం గోపాలకృష్ణ, తారిపిరెడ్డి రామకృష్ణ, నులకాని మధు తదితరులు పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:** బోడిగూడెంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పనితీరును వివరించారు. ఇది మంచి ప్రభుత్వం ప్రతులను ప్రదర్శించారు. నాయకులు నక్కా రవి, గడ్డియ్య, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● హామీల అమలు ఎన్డీయే ప్రభుత్వంతోనే సాధ్యమని ఏఎంసీ మాజీ అధ్యక్షుడు పారేపల్లి రామారావు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కొయ్యలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ముప్పిడి విజయకుమారి, పారేపల్లి నరేశ్, తోట రవి, బొమ్మా బాబు, మాదేపల్లి శ్రీను, చింతల వెంకటరమణ పాల్గొన్నారు.

**పోలవరం, న్యూస్‌టుడే:** రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే నియోజకవర్గంలోని రహదారులు, మురుగు కాలువల అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఎల్ఎన్డీపేటలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అప్పులు మిగిల్చి వెళ్లిందని, అయినప్పటికీ కేవలం వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులను గ్రామస్థులు సత్కరించారు. కొండ్రుకోట పునరావాస కాలనీలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయకులు బి.కృష్ణ, బి.వెంకటలక్ష్మి, కె.ప్రసాద్, ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**టి.నరసాపురం, న్యూస్‌టుడే:** శ్రీరామవరంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# సంపద సృష్టికి తిరిగి శ్రీకారం

**చింతలపూడి, న్యూస్‌టుడే:**

పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచడంతో పాటు ఇంటింటి నుంచి సేకరించిన చెత్త ద్వారా సేంద్రియ ఎరువుల తయారీ, పునర్వినియోగానికి అనువైన వస్తువులను వేరుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో గతంలో తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంపద సృష్టి కేంద్రాలను వైకాపా నిర్వీర్యం చేసింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రాలు, ఎరువుల తయారీ తొట్టెలు వృథాగా నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని చోట్ల మందుబాబులకు అడ్డాగా మారాయి. పల్లెల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి తీవ్ర పారిశుద్ధ్య లోపం కనిపిస్తోంది. 'స్వచ్ఛత హీ సేవా' కార్యక్రమం ద్వారా తిరిగి సంపద కేంద్రాలను గాడిన పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించారు.

**అక్టోబరు 2 కల్లా కేంద్రాలు సిద్ధం**



చింతలపూడిలో సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం

**శిక్షణ కూడా ఇచ్చారు**

అక్టోబరు 2న నూజివీడు డివిజన్‌లోని 129 పంచాయతీల్లో సంపద కేంద్రాల పునః ప్రారంభానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటీవల ప్రతీ మండలంలోని సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎరువుల తయారీకి ఉపయోగపడే వ్యర్థాలను వేరుగా సేకరించేలా అవగాహన కల్పించారు. చింతలపూడి, లింగపాలెం, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లోని సంపద కేంద్రాల రూపురేఖలు మారుస్తున్నారు. చెత్త సేకరణకు ఉపయోగించే రిక్షాలు మూలకు చేరి తుప్పుపట్టాయి. వాటిని ఉపయోగించే పరిస్థితి లేదు. రూ.లక్షలు పెట్టి కొనుగోలు చేసిన పలు రకాల యంత్రాలు నిరుపయోగంగా మారాయి. గాంధీ జయంతిలోగా వీటన్నింటిని బాగు చేసి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది.

**రూపురేఖలు మారుస్తున్నాం**

'డివిజన్ పరిధిలోని 129 సంపద కేంద్రాలను అక్టోబరు-2 నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. గ్రామాల్లో చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం'అని నూజివీడు డీఎల్పీవో సుందరి తెలిపారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి

**కామవరపుకోట(జంగారెడ్డిగూడెం పట్టణం), న్యూస్‌టుడే:** విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన కామవరపుకోట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. తడికలపూడికి చెందిన నిజవరపు సత్యనారాయణ(46) అతడి ఆయిల్ పామ్ తోటలో కుటుంబంతో నివాసముంటున్నాడు. మంగళవారం తోటకు నీరు పెట్టే క్రమంలో మోటారు వద్దకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి ఇంట్లోకి రాకపోవడంతో కుమారుడు వెంకటేశ్వరరావు వెళ్లి చూడగా.. మోటారు వద్ద సత్యనారాయణ విగతజీవిగా పడి ఉన్నాడు. ఘటనాస్థలికి తడికలపూడి ఎస్సై చెన్నారావు చేరుకుని పరిశీలించారు. విద్యుదాఘాతానికి గురై మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సత్యనారాయణ కుమారుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు హెచ్‌సీ కె.రమేశ్ కేసునమోదు చేశారు.

## మృతదేహం ఆచూకీ గుర్తింపు

**కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే:** కొవ్వూరు గోష్పాద క్షేత్రం పిండ ప్రదానాల రేవులో లభ్యమైన వృద్ధుడి మృతదేహం ఆచూకీ తెలిసింది. ఈనెల 22న (ఆదివారం) గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. దీనిపై కేసు నమోదు చేశారు. అది జంగారెడ్డిగూడేనికి చెందిన శీలంశెట్టి సత్యాజీరావు (74)గా గుర్తించారు. ఈనెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. 23న జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్లో అదృశ్యం కేసు నమోదు చేశారు. పత్రికల్లో వార్తల ఆధారంగా అది సత్యాజీరావు మృతదేహంగా కుటుంబ సభ్యులు గుర్తించారని ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

## జూద శిబిరంపై దాడి

**కొయ్యలగూడెం, న్యూస్‌టుడే:** బయ్యనగూడెంలో జూద శిబిరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని రెండు కోళ్లు, రూ.7520 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ తెలిపారు.

# నూజివీడు

• నూజివీడు • కైకలూరు


## విద్యతోనే సమాజంలో మార్పు



మాట్లాడుతున్న సుబ్బారావు

**ముసునూరు, న్యూస్‌టుడే:** విద్య ద్వారా సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవడమే కాకుండా సమాజంలో నూతన మార్పులు తీసుకురావడం సాధ్యమని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. మంగళవారం ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలపై అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా సంఘాలకు, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం సునీలా, ఏపీఎం కె.బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, జి.పద్మావతి పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో 'స్వచ్ఛతా హీ సేవా'


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు మండలం గొల్లపల్లిలో అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం హెచ్‌ఎం పి.రాధిక రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. తడి, పొడి చెత్తపై గ్రామస్థులు, స్థానికులకు అవగాహన కల్పించారు. మనోహరం, కుమారి, రవీంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు డీఎస్పీగా ప్రసాద్

**నూజివీడు, ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే:** నూజివీడు డీఎస్పీగా కేవీవీఎన్‌వీ ప్రసాద్‌ను నియమిస్తూ డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈయన విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ నుంచి బదిలీపై నూజివీడు వస్తున్నారు. ఇక్కడ పనిచేసిన డీఎస్పీ లక్ష్మయ్య ఇటీవల సీఐడీకి బదిలీ అయ్యారు.


కైకలూరు సీఐగా రవికుమార్... కైకలూరు గ్రామీణ సీఐగా వి.రవికుమార్‌ను నియమిస్తూ డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈయన ప్రస్తుతం ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్నారు.

## ఆగిరిపల్లి ఎంపీడీవోగా భార్గవి

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి ఎంపీడీవోగా బి.భార్గవిని నియమిస్తూ కృష్ణా జిల్లా జడ్పీ సీఈవో ఆర్.సి.ఆనంద్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆమె విజయవాడ గ్రామీణ నుంచి ఆగిరిపల్లి రానున్నారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన పి.శంకరరావు పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి అబ్దుల్ సలాం ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## ఈ దారిలో ప్రయాణమంటే హడలే!


కొన్నంగుంటలో గోతులు ఇలా..


వడ్లమానులో కోతకు గురైన కల్వర్టు


ఆగిరిపల్లి: హైస్కూలు రోడ్డులో పోటెత్తిన మురుగు

నూజివీడు నియోజకవర్గంలోని రహదారుల్లో ప్రయాణమంటే జనం హడలిపోతున్నారు. ఓ వైపు భారీ గుంతలు, మరోవైపు ప్రమాదకరంగా ఉన్న కల్వర్టులు వాహనదారులను భయపెడుతున్నాయి. ఇటీవల వరదలకు నూజివీడు మండలం పాతరావిచర్ల, ఆగిరిపల్లి మండలం వడ్లమానులలోని కల్వర్టులు కోతకు గురయ్యాయి. నూజివీడు మండలం కొన్నంగుంట, ఆగిరిపల్లి, చిన్నఆగిరిపల్లి, గన్నవరం రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆగిరిపల్లిలోని జిల్లా పరిషత్తు పాఠశాల రోడ్డులోని రహదారిపై మురుగు పారుతోంది. అధికారులు పరిశీలించి రహదారులు, కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

\- ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే, నూజివీడు

## గత పాలకుల గొప్పలు.. ప్రజలకు తిప్పలు!


పుల్లవా కాలువ ముంపు నీటిలో ఆటపాక జగనన్న కాలనీ


అధ్వానంగా అంతర్గత రహదారి

**ఆటపాక(కైకలూరు), న్యూస్‌టుడే:** జగనన్న కాలనీల పేరుతో కొన్ని గ్రామాల్లో నివాసయోగ్యం కాని స్థలాలు పంచి లబ్ధిదారులను అవస్థలకు గురి చేసింది గత ప్రభుత్వం. డ్రెయినేజీ, తాగునీటి వసతులు కల్పించకుండా ఇష్టానుసారంగా రోడ్డు పక్కన, మురుగు కాలువల చెంతన ప్రభుత్వ భూములను నామమాత్రంగా పూడ్చి పట్టాలు మంజూరు చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ కోవలోకే వస్తుంది కైకలూరు మండలం ఆటపాక జగనన్న కాలనీ. వరహాపట్నం ప్రధాన రోడ్డు మార్గం పక్కన పుల్లవా డ్రెయిన్‌ను అనుకుని ఉన్న చోట లే-అవుట్ వేసి సుమారు 30 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో సుమారు 5 మంది ఇళ్లు పూర్తి చేయగా పది మందికి పైగా ఇంటి పునాదులు వేశారు. అయితే చిన్నపాటి వర్షం కురిసినా కాలనీ అంతా పూర్తిగా జలమయమవుతోంది. ఇటీవల వచ్చిన వరదలకు పుల్లవా పొంగి చెంతనే ఉన్న కాలనీని ముంచేసింది. ఇంకా మురుగు కాలువ ఉద్ధృతిగానే ఉండటంతో 20 రోజుల నుంచి నీటిలోనే కాలనీ నానుతోంది. పునాది దశలో ఉన్న ఇళ్లన్నీ నీటిలో మునిగిపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. నిర్మాణం పూర్తయిన నివాసాల చుట్టూ నీరు ఉండటంతో నీటిలోనే ప్రధాన రోడ్డుకు చేరుకోవాల్సిన దుస్థితి. కొందరు నిర్మాణాలకు తెచ్చిన ఇసుక, కంకర ముంపులో కొట్టుకుపోయాయి. నీటిలో ఉన్న పునాదులు నిర్మాణానికి అనుకూలిస్తాయో లేదో తెలియని అయోమయంలో లబ్ధిదారులు ఉన్నారు. గత వైకాపా సర్కారు గొప్పల కోసం తమతో బలవంతంగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించేలా చేసి తమను నిండా ముంచేసిందని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.

## భారీ వర్షంతో నిలిచిన ట్రాఫిక్


వాహనాలను క్రమబద్ధీకరిస్తున్న ఎస్సై శుభశేఖర్

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి మండలంలో మంగళవారం సాయంత్రం సుమారు 3 గంటల పాటు పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి పొర్లాయి. ఆగిరిపల్లి-గన్నవరం ప్రధాన రహదారిపై కుంపిని వాగు పొంగింది. పోతవరప్పాడు, నూగొండపల్లి గ్రామాల్లో చెరువు కట్టలకు గండ్లు పడి వరద నీరు రహదారిపై పారింది. నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారిపై గోపాలపురం సమీపంలో పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో సుమారు 5 కి.మీ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

## మళ్లీ కొట్టుకుపోయిన రహదారి



**ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఇటీవల వరదలకు చింతలవల్లి-చెక్కపల్లి మార్గంలో అలికిడి రహదారి మధ్యలో సంధ్యపు వాగు ఉద్ధృతికి రహదారికి గండి పడిన విషయం తెలిసిందే. అధికారులు అక్కడ తాత్కాలిక మరమ్మతులు సైతం చేశారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి అదే ప్రాంతంలో మళ్లీ రోడ్డు కొట్టుకుపోయింది. భారీ వర్షం మరింత పెరిగితే రహదారి పూర్తిగా కొట్టుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ముందస్తు జాగ్రత్తగా భారీ వాహనాల రాకపోకలు సాగించకుండా అప్రమత్తం చేశారు.

## రాష్ట్రాభివృద్ధే కూటమి ధ్యేయం

**కలిదిండి, న్యూస్‌టుడే:** రాష్ట్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు మంచి చేయడానికి ప్రభుత్వం పాటుపడుతుందని చిట్టూరి రవీంద్ర, నల్లగోపుల చలపతి, కాళ్లపాలెం బుజ్జి అన్నారు. కోటకలిదిండిలో మంగళవారం మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చిట్టూరి సురేశ్, సాన సతీశ్, కాసా ప్రభాకర్, జడ్డు సుబ్రమణ్యం, అందుగల లాలు పాల్గొన్నారు.

**ముసునూరు:** ముసునూరు ఉప సర్పంచి తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముసునూరులో కరపత్రాలు పంపిణీ చేశారు. లోపూడిలో లక్కపాము కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చలమాల వెంకటేశ్వరావు, పేరం వెంకటరత్నం, నక్కా చెన్నారావు, గార్లపాటి నరసింహారావు పాల్గొన్నారు.


పెరికెగూడెంలో..

**కైకలూరు:** తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు, తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ రహీమ్ ఆధ్వర్యంలో కైకలూరు 115వ బూత్ పరిధిలో కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు పోలవరపు లక్ష్మీరాణి, వీరాబత్తిన సుధ, కొల్లి వరప్రసాద్, రసూల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**మండవల్లి:** మండవల్లి మండలం పెరికెగూడెం, గన్నవరం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం గోడపత్రికలు అంటించారు. నాయకులు ఎలికే రాంబాబు, ఆంజనేయులు, తలారి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** అల్లూరు, బొమ్మినంపాడు, వణుదుర్రు, ప్రొద్దువాక, దాకరం, పెయ్యేరులో మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు, నాయకులు యర్రా రాంబాబు, బాసింశెట్టి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


కోటకలిదిండిలో కరపత్రం అందిస్తున్న నాయకులు


లోపూడిలో..

## నేడు వ్యాస రచన పోటీలు

**చాట్రాయి, న్యూస్‌టుడే:** పాఠశాల, స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ఈ నెల 25న మండలంలోని అన్ని పాఠశాలలు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో 'స్వర్ణాంధ్ర సంస్కరణలు' అనే అంశాలపై వ్యాసరచన, చర్చ కార్యక్రమం పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో వీఎస్వీ బ్రహ్మచారి తెలిపారు. 27న మండల స్థాయి, 29న జిల్లా స్థాయిలో నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

## పిచ్చి మొక్కలు అల్లుకుని.. ఆందోళనగా మారి!



**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు మండలం అన్నవరం నుంచి వెంకటాయపాలెం వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కలు, తీగలు తొలగించి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై విద్యుత్తు ఏఈ గౌరు నాయుడు మాట్లాడుతూ.. పిచ్చి మొక్కలు తొలగించి, శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## పశు పోషకులకు దాణా పంపిణీ

**ముసునూరు, న్యూస్‌టుడే:** పోశు పోషకులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న దాణాను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ కొల్లి గంగారాం అన్నారు. మంగళవారం గుడిపాడులో పశు పోషకులకు ప్రభుత్వం సరఫరా చేసిన దాణాను పశువైద్యుడు పేరం అశోక్ ఆధ్వర్యంలో అందజేశారు. వర్షాలు, వరదలతో నష్టపోయిన పశు పోషకులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. రాజబోయిన శ్రీనివాసరావు, రామారావు, వెంకటేశ్వరావు, కృష్ణ, వెంకటాద్రి పాల్గొన్నారు.


అందజేస్తున్న నాయకులు

## చెల్లని చెక్కు కేసులో జైలు

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. నూజివీడుకు చెందిన దండమూడి అజయ్‌కుమార్ 2018 ఫిబ్రవరిలో రూ.2.50 లక్షలను కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన పలగాని విజయ్‌కుమార్‌కు అప్పుగా ఇచ్చారు. బాకి చెల్లించమని కోరగా విజయ్‌కుమార్ రూ.2.75 లక్షలకు చెక్కు ఇచ్చారు. దానిని బ్యాంకులో ఇవ్వగా ఖాతాలో నగదు లేదని తెలియడంతో అజయ్ కుమార్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విచారణ అనంతరం న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

## పాఠశాల పరిశుభ్రత బాధ్యత యాజమాన్య కమిటీలకు

• ఉపాధ్యాయులపై తగ్గనున్న భారం
• నాణ్యమైన బోధనకు అవకాశం

**నూజివీడు, న్యూస్‌టుడే:** ప్రభుత్వ బడుల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)లను భాగస్వాములను చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కమిటీ సభ్యులు, సచివాలయాల్లోని సంక్షేమ సహాయకులు పాఠశాలల్లో మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని పాఠశాల విద్యా శాఖాధికారులు సూచించారు. వీరు తీసిన చిత్రాలు ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.

### సభ్యులకు ఐడీ, పాస్‌వర్డ్‌లు..

యాజమాన్య కమిటీ సభ్యులు ప్రతి బుధ, శుక్ర వారాల్లో పాఠశాలలకు వచ్చి మరుగుదొడ్ల చిత్రాలు తీయాలని ఆదేశాలు వచ్చాయి. వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య (ఐడీ), పాస్‌వర్డ్‌లు కేటాయించారు. ఆ సంఖ్యతో ఐఎంఎంఎస్ యాప్‌ను తెరిచి మరుగుదొడ్ల చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. దీనిపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. సంక్షేమ సహాయకులు సోమ, గురువారాల్లో చిత్రాలు తీయాల్సి ఉంది.

**నియోజకవర్గంలో ఇలా...**

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| నూజివీడు | 93 | 7137 |
| ఆగిరిపల్లి | 50 | 3759 |
| ముసునూరు | 63 | 3732 |
| చాట్రాయి | 63 | 3215 |

### గత ప్రభుత్వంలో హెచ్‌ఎంలపై భారం..

గత వైకాపా ప్రభుత్వం ఉపాధ్యాయులపై పలు రకాల యాప్‌ల నిర్వహణ భారం మోపింది. వారు వీటిలో వివరాలు నమోదుకే రోజూ ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చేది. దీంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందకుండా పోయింది.

### ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారనే..

విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చేయడంలో వారి తల్లిదండ్రుల సూచనలు కీలకం. పిల్లల్ని ఇంట్లో మాదిరిగానే పాఠశాలల్లో మరుగుదొడ్లను శుభ్రంగా వినియోగించుకునేలా చూడటం వీరి విధి. అందుకే నిర్వహణ పనుల్లో భాగస్వాములను చేశారు. ఎక్కడైనా అపరిశుభ్రంగా ఉన్నా, మరమ్మతులకు నోచుకోకున్నా తక్షణం ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.

### తప్పనిసరిగా నమోదు చేయాలి..

యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి, పరిశుభ్రతకు కృషి చేయాలి. ఐఎంఎంఎస్ యాప్‌లో వారంలో రెండు సార్లు యాజమాన్య కమిటీ సభ్యులు, మరో రెండు రోజులు సంక్షేమ కార్యదర్శులు చిత్రాలు తీసి అప్‌లోడ్ చేయాలి.

\- సేవ్యా నాయక్, డీవైఈవో, నూజివీడు

## పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కొడాలి వినోద్



**ముదినేపల్లి, న్యూస్‌టుడే:** ఎన్డీయే ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో కైకలూరు నియోజకవర్గం నుంచి ముదినేపల్లికి చెందిన కొడాలి వినోద్ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులయ్యారు. నియోజకవర్గంలో గత అయిదేళ్లలో పార్టీ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారు. పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు ఆయనకు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## యువతి అదృశ్యం

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** బాలిక కనిపించడం లేదని తండ్రి ఫిర్యాదు చేసిన ఘటన ఆగిరిపల్లి మండలంలోని ఓ గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఓ బాలిక(17) పదో తరగతి వరకు చదువుకుని ప్రస్తుతం ఇంటి దగ్గరే ఉంటుంది. అయితే ఈనెల 23న ఉదయం తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి కుమార్తె కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంట్లో ఉంచిన రూ.50వేల నగదు కనిపించలేదు. దీంతో బాలిక తండ్రి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.

## జూదరుల అరెస్టు

**ఆగిరిపల్లి, న్యూస్‌టుడే:** ఆగిరిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల సమీపంలో మంగళవారం జూదం ఆడుతున్న వారిపై పోలీసులు నిర్వహించిన దాడిలో అయిదుగురు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.12 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు.


వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

## విద్యార్థుల ఉన్నతే గురువుల లక్ష్యం

**మండవల్లి, న్యూస్‌టుడే:** విద్యార్థుల ఉన్నతే గురువుల లక్ష్యమని చింతపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం రవికుమార్ అన్నారు. సెప్టెంబర్ 5 గురుపూజోత్సవాన్ని వరద కారణంగా నిర్వహించలేదని తెలిపారు. దీంతో మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు శారద, రోజారాణి, నాగేశ్వరరావు, సుబ్బారావు, నోబుల్, రామాంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రపై అవగాహన అవసరం


ప్రకాశంను సత్కరిస్తున్న అధ్యాపకులు

**కైకలూరు, న్యూస్‌టుడే:** చరిత్ర పాఠ్యాంశాలపై విద్యార్థులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాల చరిత్ర అధ్యాపకుడు బి.ప్రకాశం అన్నారు. స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిస్టరీ ఆధ్వర్యంలో మంగళవారం చరిత్ర దాని ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు అతిథి ఉపన్యాసం నిర్వహించారు. అనంతరం అధ్యాపకులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఉదయ్‌ప్రకాష్, హరిప్రసాద్, వేదంతం, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

**నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే:** నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం మంగళవారం కళాశాల పరిపాలన అధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రాంగణంలో మొక్కలు నాటించారు. పిచ్చి మొక్కలను శుభ్రం చేయించి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డైరెక్టర్ అమరేంద్రకుమార్, శ్రావణి, పి.వి.లక్ష్మణరావు, బొత్స శ్రీనివాసరావు, సీతాపతిరావు, తులసి, నిరంజని, పీఆర్‌వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**పీజీ సెంటర్‌లో..** నూజివీడు పట్టణంలోని కృష్ణ యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో ఎన్ఎస్ఎస్ దినోత్సవం నిర్వహించారు. కళాశాల ఆవరణలో 200 మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.నవీనలావణ్య, డాక్టర్ టి.నాగరాజు, అన్వర్ బాషా పాల్గొన్నారు.


ట్రిపుల్ ఐటీ కళాశాలలో మొక్క నాటిన విద్యార్థులు

## మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

నూజివీడు పట్టణం: 99486 40551 | కైకలూరు: 73060 88555
నూజివీడు : 80085 74698 | కలిదిండి: 90594 84862

**చాట్రాయి, న్యూస్‌టుడే**

**సమస్య:** ఎన్ఆర్.పాలెం రహదారిలో ఇటీవల వర్షాలకు రాళ్లు లేచి పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- మందపాటి వెంకటేశ్వరరెడ్డి, ఎన్ఆర్.పాలెం**

**సమాధానం:** వర్షాలతో పడిన గండ్లను గుర్తించాం. త్వరలోనే పనులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

**- సీహెచ్.బాబూరావు, ర.భ.శాఖ డీఈ, నూజివీడు**

**ముసునూరు, న్యూస్‌టుడే**

**సమస్య:** గోపవరంలో ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు పైకి వెళ్లేందుకు ఇనుప మెట్లు తుప్పు పట్టి విరిగిపోయాయి. ట్యాంకు ఇళ్ల మధ్యలో ఉండటంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్యాంకును తొలగించాలని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. **- రాంబాబు కంచర్ల, స్థానికుడు**

**సమాధానం:** పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

**- వెంకట సత్యప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ**

## గండ్లు పూడ్చివేత

స్పందనకు వందనం

**చాట్రాయి, న్యూస్‌టుడే:** సత్తుపల్లి-విజయవాడ రాష్ట్రీయ రహదారిలో వేంపాడు మేజర్ కాలువ సమీపంలో రేగటి వాగు వరద ఉద్ధృతితో పడిన గండ్లతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయని 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త వచ్చిన నేపథ్యంలో అక్కడికి చేరువలో ఉన్న గ్రామస్థులు స్పందించారు. ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి గండ్లు పూడ్చి వేశారు. ఇప్పటికైనా ర.భ.శాఖ అధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

## సినిమాలు

**నూజివీడు పట్టణం**

| | |
|---|---|
| సత్యనారాయణ | ------------ |
| సత్యనారాయణ మినీ | సరిపోదా శనివారం |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 1 | ------------ |
| ద్వారక సినిమాస్ స్క్రీన్ 2 | మత్తు వదలరా 2 |
| ద్వారక సినిమాస్ స్క్రీన్3 | సిక్లెట్స్ |
| **ఆగిరిపల్లి:** శ్రీఅను డీలక్స్ | కళింగ |
| **కైకలూరు** | |
| విజయలక్ష్మి జీ3 సినిమాస్ | సరిపోదా శనివారం |
| మాగంటి సినిమాస్ | చిక్లెట్స్ |
| శ్రీవెంకటరమణ సినిమాస్ | మత్తు వదలరా 2 |
| **ముదినేపల్లి:** పూర్ణిమ | మత్తు వదలరా 2 |

## 'పొలం పిలుస్తోంది'తో రైతుల చెంతకే అధికారులు



కానుకొల్లులో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

**మండవల్లి, న్యూస్‌టుడే:** పొలం పిలుస్తోంది కార్యక్రమంతో వారంలో రెండు రోజులు రైతుల చెంతకే వ్యవసాయ అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని ఏడీఏ వెంకటమణి అన్నారు. మండలంలోని లింగాల, కానుకొల్లు గ్రామాల్లో మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. ఏవో జరీన, మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారి రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కాంతమ్మ, నాగవిజయ, సర్పంచి థామస్, తెదేపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

**కైకలూరు:** మండల వ్యవసాయశాఖ అధికారిణి ఆర్.దివ్య పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వింజరం, తామరకొల్లు గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. మత్స్యశాఖ ఎఫ్‌డీవో భవిత, సర్పంచులు కట్టా నాగరాజ్‌గౌడ్, భట్రాజు శివాజీ తదితరులు పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** సాగులో రైతులను సుశిక్షితులను చేయడంతో పాటు వ్యవసాయ, అనుబంధ శాఖల నుంచి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సూచనలు తెలియజేయడమే 'పొలం పిలుస్తోంది' లక్ష్యమని తెదేపా నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు అన్నారు. శ్రీహరిపురం, సింగరాయపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, పశు వైద్యాధికారి క్రాంతికుమార్, ప్రకృతి విభాగం మండల ఇన్‌ఛార్జి గౌతమ్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.



తామరకొల్లులో..


సింగరాయపాలెంలో..

## బీమా చెక్కు అందజేత



**ముసునూరు, న్యూస్‌టుడే:** కాట్రేనిపాడుకు చెందిన వెలగపూడి వెంకట్రావు రెండు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా కింద రూ.436 బీమా కట్టి గోపవరం స్టేట్ బ్యాంకులో ఖాతా కలిగి ఉన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్టేట్ బ్యాంక్ మేనేజర్ కె.రాంబాబు రూ.2 లక్షల బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.